




# మనం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

మంగళవారం I 21 I ఫిబ్రవరి I 2023 I పేజీలు : 14


## అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

**– మల్లేపల్లి, రాములు తండా, బావోజి తండా, జింకల్ తండా, పరికలబోడు తండా గ్రామాల్లో మొత్తం 30 పనులకు గాను రూ.1.13 కోట్ల పనులు ప్రారంభం**


వివరాలు7లో..


## పోడు పట్టాల పంపిణీలో వ్యత్యాసాల సవరణ పూర్తి చేయండి

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

– తహసీల్దార్ ఎంపిడిఓ సంయుక్త ధృవీకరణ తప్పనిసరి




వివరాలు7లో..


## శిథిలావస్థలో ఉన్న కోర్టు భవనాన్ని పరిశీలించిన భట్టి

**– మధిర పట్టణం చాలా చారిత్రాత్మకమైన పట్టణం**

**– మీడియాతో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క**



**మధిర టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** పురాతన కట్టడం శిధిల వ్యవస్థకు చేరిన కోర్టు భవనమును సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సోమవారం పరిశీలించారు .ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ హైద్రాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యం కోసం పోరాటానికి చేయూత అందించిన ప్రాంతం మధిర,నాడు హైదరాబాద్ రాష్ట్రం స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్న రోజుల్లో సర్దార్ జమలాపురం కేశవరావు నాయకత్వంలో, హైద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న స్వామి రామానంద తీర్థ నిజాం నవాబ్ రజాకార్ల తో పోరాటం చేస్తున్న సమయంలో గాయాలు, అయిన వారికి ఇక్కడ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అండగా ఉండి మరలా వారిని పోరాటానికి సన్నద్ధం చేసిన ప్రాంతం ఇది అని,ఇలాంటి ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందాలి అన్నదే నా కోరిక,నా ప్రయత్నం ఇలాంటి ప్రాంతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం దానికి తోడుగా విద్య,పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందితే మధిర ప్రాంతానికి తిరుగుండదు.విద్య అభివృద్ధి లో భాగంగా మనం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల,రెగ్యులర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసుకోవడం జరిగింది.అలాగే జేఎన్టీయూ లాంటి కలశాల కూడా ఒకటి కావాలని కోరడం జరిగింది అని అందుకు నా ప్రయత్నం చేస్తాను.గతంలో అనేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసుకున్నాం, అలాగే కస్తూరిబా లాంటి రెసిడెన్షియల్ పాఠశాలలు కూడా ఏర్పాటు చేసుకున్నాం వాటికి అనుబంధంగా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలిఅని ,మారుతున్న పారిశ్రామిక,ఆధునిక అవసరాలకు అనుగుణంగా సైన్స్ అండ్ 2లో...

## ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

**– అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్**

**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం బ్యూరో) :** ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయల భవన సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ''గ్రీవెన్స్ డే'' లో పలు సమస్యలకు సంబంధించి అర్జిదారుల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార చర్యలకై ఆదేశించారు.

మంగాపురం గ్రామంకు చెందిన గుగ్గులోతు భేఖరే తన భర్త మరణించారని, తన కుమారుడు తనను చూడటం లేదని తన ఎకరం భూమిని తన పేరున మార్పుచేసి ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్య నిమిత్తం ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారికి సూచించడం జరిగింది. రఘునాథపాలెంకు చెందిన గాజుల వెంకటేశ్వర్లు తనకు ఆసరా పెన్షన్ మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్య నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సూచించారు. మధిర మండలం అంబారుపేటకు చెందిన రేపాకుల శ్రీలక్ష్మి తన భర్త విష్ణుకుమార్ పేరున నేలకొండపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెం.1173, 1171 లో ప్లాట్ నెం.47, విస్తీర్ణం193.33 చదరపు గజములు కొనుగోలు చేయడం జరిగిందని, తేది.15ఋ9ఋ2019న మరణించినారని తమ అత్త, మామలు కలిసి తనకు తెలియకుండా ఖమ్మం నివాసి ఆయిన ఈదు ప్రసాదుకు రిజిష్టరు చేసినారు అట్టి రిజిస్ట్రేషన్ను రద్దుపరిచి తను తన



కుమారుడు రేపాకుల విష్వంత్రాజ్ పేరున మార్పు చేయగలరని సమర్పించిన దరఖాస్తును విచారణ చేసి తగు చర్యకై జిల్లా రిజిష్ట్రార్ను కలెక్టర్ ఆదేశించారు. సత్తుపల్లి మండలం అయ్యగారిపేటకు చెందిన బోయపాటి లలితకుమారి ధరణిపోర్టల్లో మిస్సింగ్ సర్వేనెం.123/ఉ/అ/1, దరఖాస్తు చేయడం జరిగిందని అట్టి సమస్యను పరిష్కరించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్యకై కల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారికి సూచించారు. మధిర మండలం మాటూరు గ్రామంకు చెందిన మోదుగు దానియేలు మాటూరు గ్రామ రెవెన్యూలో సర్వేనెం.955లో గల ఎ0ఋ20 కుంటల భూమిని 20 సంవత్సరంల నుండి సాగు చేసుకోవడం జరిగిందని అట్టి భూమి తన స్వాధీనంలో సాగులో ఉందని అట్టి భూమిని తన పేరున నమోదు చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్యలకై మధిర తహాశీల్దారును ఆదేశించారు. ఖమ్మం నగరం 1వ డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన గుర్రం వెంకటరామయ్య తన తండ్రి గుర్రం భాస్కరయ్య, వారి అన్నగారు గుర్రం రామయ్య, తమ్ముడు గుర్రం నర్సయ్య ముగ్గురి పేరుమీద ఖమ్మం అర్బన్ రెవెన్యూ మల్లెమడుగు రెవెన్యూ గ్రామం 413/అ1 సర్వేనెంబర్లో 8 ఎకరాల 4 కుంటల భూమి జాయింట్ పట్టాగా కలదని, ప్రస్తుతం రికార్డులో గుర్రం నర్యయ్య ఒక్కరి పేరున నమోదు కావడం జరిగిందని అట్టి సమస్యను పరిష్కరించి అట్టి 8 ఎకరముల 4 కుంటల భూమిని ముగ్గురికి సమభాగములుగా నమోదు చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలన చేసి తగు చర్యకై అర్బన్ తహాశీల్దారును ఆదేశించారు. కొణిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామంకు చెందిన తడికమళ్ళ నాగేశ్వరరావు, స్వాతి దంపతులకు ఇద్దరు అంగవైకల్యం కలిగిన పిల్లలకు దివ్యాంగుల పించను, దళితబంధు పథకం మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష,జిల్లా స్థాయి అధికారులు తదితరులు గ్రీవెన్స్ డే లో పాల్గొన్నారు.



# అమ్మ భాష.. మన శ్వాస

పరాయి భాషల ప్రభావంతో కన్నతల్లినే (మాతృ భాషనే) కాదంటున్న వికృత పరిస్థితులకు చెల్లు చీటి ఇవ్వవలసిన అవసరాన్ని గుర్తించాలి. పసి ప్రాయంలోనే తల్లిదండ్రులు ఆంగ్ల భాష మోజులో ' మమ్మీ, డాడీ అని పిలిపించుకోవాలని తాపత్రయంతో మూల కణాలపై కేనర్స్ లాంటి వ్యాధిని ప్రవేశ పెట్టడం వలన తరానికి మన మూలమైన అమృత భాష తెలుగు తెలియకుండా పోతుంది. ఏ వస్తువును ఏమంటారో తెలుగులో చెప్పలేని, నేర్వ లేని దుస్థితి.

ప్రపంచ మహాసభల పేరిట ఒక ఉద్యమంగా ఉవెత్తున ఎగసిన కెటరం తన ధాటితో లక్ష్యాన్ని సాధించలేక పోయింది. కొద్ది రోజుల హడావుడి తరువాత చప్పబడి పోయింది. ఆంధ్రులు ఆరంభ శూరులు అన్న మాట యధార్ధమేమో, ' ఆ ' స్థానంలో ' ఏ ' అనేది అమ్మకు ఎన్నటికి ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలి.

ఏ భాష నీది ఏమి వేషమురా
ఈ భాష ఈ వేషము ఎవరికోసమురా
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకురా
తెలుగు వాడిపై తెలుగు రాదనచూ
సిగ్గులేక ఇంకా చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రము రాదంటూ
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా
– కాళోజి నారాయణరావు

అన్నట్లు వ్యామోహం వదలి కన్నతల్లిని ప్రేమించినట్లు భాషను ప్రేమిస్తూ తరువాత తరానికి ఆ తియ్యదనాన్ని రుచి చూపించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంది. మా అబ్బాయి / అమ్మాయి ఎల్.కె.జి. ఫీజు రూ.4,00,000/– లు అని గొప్పలు చెప్పు కుంటున్న వారు అసలు ఎందుకు కడుతున్నామో, దేనికోసం కడుతున్నాం అనేది ఆలోచించుకోవాలి. మూడేళ్లు కూడా నిండని పసి మొగ్గను ఆధునిక చెరసాలల్లో వేసి మురిసి పోతున్న తల్లిదండ్రులను చూచి నవ్వాలో ? ఏడవాలో తెలియడం లేదు.

వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, శాస్త్రాలు, కావ్యాలు, ప్రబంధాలు, నవలలు, కథలు, కథానికలు, కవితలు మొదలైన సమగ్ర సాహిత్య సంపద కలిగిన అపూర్వ భాష మన తెలుగు భాష, ఇది మృత భాష కావడం అంటే మన ప్రకృతిని మనమే విధ్వంసం చేయడం. మన కన్న తల్లిని మనమే హత్య చేయడం అన్న విషయం ప్రతి ఒక్కరు అర్ధం చేసు కోవాలి. ఇటాలియన్ ఆప్ ఈస్టుగా ప్రపంచంలోనే అతి సుందరమైన లిపులలో రెండవ స్థానం కలిగిన లిపి మన తెలుగు లిపి అని తెలుసుకోండి.

మా అమ్మ, మా నాన్న, మా అన్న అని పరిచయం చేయడానికి మొహమాటమేమిటో? అంతస్తుల తారతమ్యాలు ఏమిటో ఎప్పటికి అర్ధం కావు. కుటుంబ బంధాలు అంతర్ సూత్రం ఆ పిలుపులే అన్నది సుస్పష్టం. గ్రామాలన్నింటిలో కుల, మత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరిని బాంధవ్యాలతో కట్టి పడేసినవి ఈ వరుసలే అన్నది యధార్థం. వాటి స్థానాల్లో అంకుల్, ఆంటీలు వచ్చి చేరి వారు మనకు ఏమి అవుతారో తెలియని సందిగ్ధావస్థలోకి నెట్టారు. అన్నయ్య, తమ్ముడు స్థానం ' బ్రో 'ల సంస్కృతి వచ్చి ' బేర్ ' మనిపిస్తుంది. ఇది ఒక ప్రక్క అయితే మరోప్రక్క తల్లులు సౌందర్య లాలసతో చనుబాలు ఇవ్వని స్థితిలో భాషామ్మదనాన్ని వారికి అందకుండా శ్రీకారం చుడుతున్నారేమో ? అజంతమైన భాష మహోన్నత రూపాన్ని ఒక్కసారి ఆ బిడ్డకు రుచి చూపిస్తే 'మందార మకరందమున దేలు ' అన్నట్లు ఆ అమృత వర్షంలో తడిచి ముద్దై పునీతుడౌతాడు.

ఇది ప్రభుత్వాలు, సంస్థలు చేయవలసిన పని కాదు. ప్రతి తల్లి పూనుకుంటేనే ఇది సాధ్యం. అక్షరమాల, గుణింతాలు, పదాలు చిన్ననాడే ఔపాసన పట్టించాలంటే ప్రతి తల్లి విధిగా అవి నేర్చుకోవాలి. ' క్రష్ ' లు ఎన్నటికి బాల్యాన్ని చిదిమేసేవే అవుతాయి తప్ప 'అమ్మలు ' కాలేవు. ప్రాశ్చాత్య నాగరికత, పరుగులెత్తే ఉద్యోగాలు, అర్ధం లేని జీవన గమనాలు బిడ్డ బాల్యాన్ని కఠినతరం చేస్తున్నాయి.

మాతృ భాష వంట పట్టినంతగా పరాయి భాష హత్తుకోలేదు. ఒక పాట మనిషి జీవితాన్ని మారుస్తూ ఉందంటే ఆ గొప్ప దనం ఆ పాటలోని సునిశిత అక్షరాలు, అర్ధవంతమైన పదాల వలననే అని గమనించాలి. వాటి అన్నింటిని కలిపి మనకు చేరుస్తున్న గొప్ప దనం భాషది మాత్రమే.

అగాధమగు జలనిధిలోన ఆణిముత్యం ఉన్నటులే ' అన్న 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుందన్నా ' మనం ఉప్పొంగి పోయామంటే తెలుగు భాష మనల్ని అమ్మలా అక్కున చేర్చుకొని ఓదార్చినట్లుగా భావించడం వల్లనే అనేది సుస్పష్టం.

బ్రతుకు తెరువు వేరు, బ్రతుకు వేరు ఈ తేడాను గమనించక పోవడం వలననే ఇన్ని అనర్ధాలు. జీవించడానికి కావలసిన ఆర్ధిక అవసరాలు ' బ్రతుకు తెరువు ' అనుబంధాలు, మనస్సును నియంత్రించుకోవడానికి కావలసిన అండ, ఓదార్పు, ప్రేమ, అభిమానం, వాత్సల్యం, నైతిక విలువలు, ఆత్మ స్థైర్యం, ఆత్మ విశ్వాసం ఇవన్నీ కలిపితే ' బ్రతుకు ' ఆ బ్రతుకుకు మూలం తెలుగు భాష. నీకు కష్టం వచ్చినపుడు నీ తల్లి ఒడిలో పొందే ఓదార్పుకు, నాన్న చిటికిన వేలు పట్టు కొని నడిచిన స్థైర్యానికి మూలాధారం మాతృ భాష అని గుర్తించాలి..

శరీరంలోని శ్వాస, రక్తంలా మన భావ పరంపరకు అక్షర రూపంగా నిలిచిన అజరామరమైన మాతృభాష తెలుగును మనలో జీర్ణం చేసుకుంటే ప్రపంచంలో ఎక్కడైన విజయం సాధించ వచ్చనే నగ్న సత్యాన్ని నమ్మండి.

అన్య భాషలలో మన సౌలభ్యం కోసం కొన్ని పదాలను అరువు తెచ్చుకొని అదే పిల్లలకు నేర్పిస్తూ అసలైన మన మాతృ భాషను సంకరం కానివ్వొద్దు. తర తరాలుగా మన వారసత్వ సంపదగా వస్తున్న తెలుగు భాషపై ఏ దాడిని సహించోద్దు. అమ్మా అనే మధురమైన పిలుపుకు దూరం కావడం అంటే మన కన్న తల్లి మనకు దూరం కావడమే అని గ్రహించండి. బిడ్డ ప్రతి కదలికను అబ్బురంగా చూచే అమ్మలా భాషలో ప్రతి అక్షర మాధుర్యానికి మహాదానంద పడేది భాషా మాతృమూర్తి.

తెలుగు దేల యన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
యెల్ల నృపులు గొలువ యెరుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగు లెస్స. .

అన్న శ్రీకృష్ణ దేవరాయుల ఆత్మశక్తి కేవటం తెలుగుభాషే అన్నది నగ్న సత్యం. మనలోని భావాల ప్రసరణకు ఆయువు పట్టు తెలుగు భాష. ఎదుటి వారి హృదయాలను కదిలించాలన్నా, వారికి మనం దగ్గర అవ్వాలన్నా, మన మనస్సు వారికి తెలియాలన్నా కేవలం మాతృభాష వల్లనే సాధ్యం.

' వృక్షో రక్షతి రక్షతి : అన్నట్లు ' అక్షరో రక్షతి రక్షతి : ' చెట్టు ప్రకృతిని కాపాడినట్లు అక్షరం సమాజాన్ని కాపాడుతుంది.

ఉద్యోగమైనా, సద్యోగమైనా ఆంగ్ల భాష వస్తేనే అన్న పిచ్చితనంతో మధురమై మాతృభాషను కాలదన్ని వికట్టహాసం చేస్తున్న తరం తెలుసుకోవలసింది. కన్న తల్లి తన బిడ్డ అవసరాలను చూచి ప్రేమతో లాలించి పెంచినట్లే భాష కూడా తన అభిమానిని పెంచి పోషించి అద్భుతమైన స్థానంలో నిలబెడుతుందని గుర్తించాలి.

ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికి ' పద్యం ' మన భాష సొత్తు అవ్వడానికి ఒకే ఒక్క కారణం మన భాష అజంతం కావడం. ' ఎక్కడి నుండి రాక '' చెల్లియో చెల్లకో ''అదిగో ద్వారకా ' వంటి పద్యాలు 'ఉప్పు కప్పురంబు నొక్క పోలి కనుండు ' సాధనమున పనులు సమకూరు ధరలోన ' 'పలికెడిది భాగవతమట ' మందార మకరందం వంటి పద్యాలు కేవలం తిరుపతి వేంకట కవులు, పోతన, వేమన ల చేతనే కాదు. ప్రతి తెలుగు వాని హృదయ వాణి.

'ఇచ్చోటనే సత్కవీంద్రుల' 'ఇచట కనులు మోడ్చిన మందుబాగ్యుండొక్కడు' అంటూ జీవన వైరాగ్యాన్ని చెప్పిన అక్షరాలు జాషువావే కావు, మనందరివి కూడా. కాబట్టి ప్రపంచ స్థాయిలో తెలుగు సాహిత్యాన్ని నిలబెట్టిన తెలుగు భాషను కాదనడం, ఎందుకూ కొరగాదనడం మూర్ఖత్వం. 'తెలుగుభాషే మనకు జీవనాడి ' భాషే గెలుపుకు దారి.

(అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా)

–



**అట్లూరి.వెంకటరమణ**
**9550776152**

# మున్సిపల్ వార్డులలో ఎంఎల్ఏ హరిప్రియ పర్యటన

**ఇల్లందు ఫిబ్రవరి 20 ( మనం న్యూస్):**ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో నెలకొన్న ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు నియోజకవర్గ సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ వార్డులలో పర్యటిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ చేస్తున్న వార్డుల–పర్యటనల కార్యక్రమంలో భాగంగా ఒకటవ వార్డులో శాసన సభ్యురాలు బానోత్ హరి ప్రియ నాయక్ పర్యటన నిర్వహిస్తూ ప్రజలను హక్కును చేర్చుకుంటూ, ప్రజలలో మమేకమై గడపగడపకి వెళుతూ, అందరినీ పలకరిస్తూ, ఏ సమస్యలు ఉన్న ఆలోచించకుండా తెలియపరచగలరు అని, ప్రజల వద్దకు పాలన అన్నట్లుగా పర్యటన నిర్వహిస్తున్నారు....

అనంతరం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ మనం 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనం దినపత్రిక ప్రేక్షకులకు యాజమాన్యానికి సిబ్బందికి ప్రతి ఒక్కరికి కూడా ఈ 2023 కొత్త సంవత్సరంలో సకల శుభాలు కలగాలని కోరుకున్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధి లాగా ఉండి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ తనదైన శైలిలో ఒక బ్రాండ్ గా పేరు తెచ్చుకున్న మనం ప్రింట్ మీడియాకు ప్రజల ప్రేమ అభిమానాలతో ముందు ముందు ఇంకా ఎదిగి అభివృద్ధి



సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న కోర్టు

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ విభాగాలతో ఆ డిగ్రీ కలశాల ఉండాలి అని ప్రయత్నం చేస్తున్నా అని అన్నారు. అలాగే ఇండస్ట్రియల్ పార్క్ పెట్టాలని కూడా ప్రయత్నం ఉన్నది, మొదట నుండి చెప్పేది మధిర పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ అవసరం తద్వారా పట్టణం పరిశుభ్రంగా,దోమల బెడద,పందుల బెడద లేకుండా ఉంటుంది.దానికోసం మొన్న అసెంబ్లీలో మాట్లాడాను,అందుకు కృషి చేస్తాను అని,మధిర లో ప్రవేశించడానికి అలాగే బయటకు వెళ్ళడానికి ఒక్కటే రహదారి ఉన్నది.అందువలనే మధిర విస్తరణ కూడా వేగవంతంగా జరగడంలేదు అందుకు అనుగుణంగా సమాంతరంగా రహదారులు అభివృద్ధి చేయాలి.తగు ప్రణాళికల అందుకు సిద్ధంగా ఉన్నాయి.ఇందిరా డైరీ ఏర్పాటు కూడా అవసరం వ్యవసాయ ఆధారిత పరిశ్రమ కు సంబంధించి ఇందిరా డైరీ లో అందర్నీ భాగస్వాములు చేసి ఇది ఏర్పాటు చేయాలని ఆలోచనా అందుకు కూడా నా ప్రయత్నం చేస్తాను అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలియజేశారు.

# పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలి : ఐఎఫ్‌టియు



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** ఖమ్మం జిల్లాలో గత నాలుగు నెలల నుండి గ్రామాలలో పనిచేసే గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జీతాలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ అప్పారావు జిల్లా కార్యదర్శి పి రామదాస్ డిమాండ్ చేశారు. సోమవారం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో అప్పారావు, రామదాసు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 12 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు నిత్యం గ్రామాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్నారు కానీ వారికి నెలవారి వచ్చే వేతనాలు సక్రమంగా రాక కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని వారి ఆరోపించారు, జిల్లాలో కలెక్టర్ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి ఫలితం లేదని, దాదాపు మూడు నెలల నుండి జీతాలు రాక కార్మిక కుటుంబాలు తీవ్ర దుర్భరమైన జీవనం సాగిస్తున్నారని వారు ఆరోపించారు, కావున వెంటనే జిల్లా అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం, ఇప్పటికీ చాలీచాలని వేతనాలతో జీవనం గడుస్తున్న కుటుంబాలకు వచ్చే వేతనాలు సక్రమంగా రాక ప్రతిరోజు జీతాల కోసం ఎదురుచూస్తున్నారని వారన్నారు, వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని, ఆదివారం సెలవు ఇవ్వాలని,సర్పంచ్ లు కార్యదర్శుల వేధింపులు నిలిపివేయాలని,లేనియెల్ల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు, పంచాయతీ కార్మికులు తమ వేతనాల పెంపుదల కోసం బకాయిల కోసం భవిష్యత్తులో జరిగే ఆందోళనకు సిద్ధంగా ఉండాలని వారి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బిక్షం, నారాయణ, వెంకటేశ్వరరావు, నరేష్, సైదులు, రాజు, రాంబాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలలు జీతాలు లేక పంచాయతీ కార్మికుల ఇబ్బందులు







**మధిర, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** మధిర మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 51 జీవో ప్రకారం మల్టీపర్పస్ వర్కర్లుగా కెసిఆర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని ఉదయం ఐదు గంటలకే నిద్రలేచి వీధిలైట్లు ఆర్పి ,నీటి సరఫరా చేసి గ్రామంలో కరోనా విజృంభిస్తున్న తరుణంలో వారి భార్య పిల్లలు ఉన్నారని ఆలోచించకుండా కూడా గ్రామం లో ఎవరికైనా కరోనా వచ్చిన వాళ్ల ఇంటికి వెళ్లి పలు కార్యక్రమాలు నిర్వహించిన వారికి అండగా ఉన్నామని గ్రామపంచాయతీ కార్మికులు వ కావలసిన సహాయ సహకారాలు అందించిన కూడా గ్రామ కార్మికుల కుటుంబానికి భరోసా లేదని,గ్రామంలో వాటర్ లైన్ మరమ్మత్తులు , ఇతర కార్యక్రమాలు, ఓటర్ ఐడి కార్డు అప్డేట్ , గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి ఇంటి ముందు పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బ్లీచింగ్ చల్లడం , గ్రామంలో రాజకీయ నాయకులు , అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు గ్రామాన్ని పరిశుభ్రపరిచి వారికి సహాయ సహకారాలన్నించు తున్నప్పటికీ న జాలి దయ అనేది లేకుండా నేటికీ మాకు వచ్చే కొద్దిపాటి జీతాలు రాక బతుకు బారమై జీతాలు ఇకనైనా పడతది అనే ఆలోచనతో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు అధికారులు కానీ రాజకీయ నాయకులు కానీ ఎవరో కూడా మా సమస్యలపై వారి యొక్క ఆర్థిక ఇబ్బందులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా వారిని గుర్తుచే స్థాయిలో ఎవరూ కూడా లేరు. మంత్రి వారు ఓ సఫాయి అన్న నీకు సలాం అని ఒక నమస్కారం పెట్టి చేతులు దులుపుకున్నాడు₹ తప్ప ఆ కుటుంబాలకు అధికారంలో ఉన్న ప్రభుత్వం అండగా ఉండి వారికి కావలసిన పిఎఫ్ మరియు ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని ఆలోచన చేయట్లేదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంత్రులలకు, ప్రతిపక్ష నాయకుడు బట్టి విక్రమార్క , అధికారులకు కార్మిక సోదరులు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన వాటి తీసుకొని చెత్తబుట్ల పడేయడం తప్ప వాటిపై చర్చించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆలోచన ఎవరు చేయలేదు గ్రామపంచాయతీ కార్మికుల అనారోగ్య పాలు అయితే వారి కుటుంబాలు అప్పులు చేసి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత వడ్డీలు కట్టలేక జీతాలు సరైన టైం లో పడక బతుకుతారమై కొంతమంది కార్మికులు చనిపోతుంటే మరి కొంతమంది వడ్డీలు కట్టలేక తనువు చాలిస్తున్నారు. బంగారు తెలంగాణలో అయినా గ్రామపంచాయతీ కార్మికుల బతుకులు మారుతాయి అనుకుంటే అది పొరపాటే గ్రామపంచాయతీలో పనితనం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవార్డులు మీకు ఇస్తే మీరు జీతాలు మాకు కట్ చేస్తారు, ఈ అవార్డులు వచ్చింది అంటే అది గ్రామ సర్పంచి మరియు గ్రామ కార్యదర్శి గ్రామపంచాయతీ కార్మికుల యొక్క సమన్వయంతో తప్ప ఎవరి గొప్పతనం చూసి ఇస్తారు అని కూడా ఆలోచించరు ఇటువంటి ఎన్నో అవమానకరమైన బాధలు భరిస్తూ కూడా వారి మొహంపై చిరునవ్వు ఎప్పటికీ తొలగిపోదు మా నాయకుడు నా పంచాయతీ కార్మికులకు అన్యాయం చెయ్యడు అనే ఆలోచన తప్ప మరి వేరే ఆలోచన లేదు. అత్యంత అవమానకర, ఆర్థిక అనారోగ్యం బాధలు భరిస్తుబతుకు భారవై ముందుకు సాగుతున్న పంచాయతీ కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గ్రంథాలయానికి కంప్యూటర్స్‌ను ఉచితంగా అందజేసిన జిమ్మిడి రాకేష్



**పినపాక, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** పినపాక మండలం లోని గ్రంధాలయ శాఖ లో డేటా యంటర్ చేయడానికి కంప్యూటర్స్ లేని స్థితిని గమనించిన జిమ్మిడి శివశంకర్ కుమారులు రాకేష్ ప్రకాష్, అనివేష్ లు గ్రంధాలయ శాఖ ఇంఛార్జి బింగి గీతా ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్స్ ను గ్రంధాలయానికి ఉచితం గా పంపిణీ చేశారు. గ్రంధాలయ శాఖ ఇంఛార్జి బింగి గీత మాట్లాడుతు జిమ్మిది శివశంకర్ కుమారులకు కృతజ్ఞతలను తెలియజేశారు. శివశంకర్ కుమారుడు రాకేష్ మాట్లాడుతూ ఓపీ గ్రంధాలయానికి ఎంతో రుణపడి ఉన్నామని, గ్రంధాలయానికి అభివృద్ధి కొరకై కంప్యూటర్స్ ను దానం చేయటం చాలా ఆనందంగా ఉందని ప్రతి ఒక్కరు కూడా గ్రంధాలయానికి వచ్చి శాఖలో ఉన్నటువంటి బుక్స్ ని గాని మంచి మంచి ఆర్టికల్స్ ఉన్న పుస్తకాలను గాని వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినటువంటి మాటలను ఆయన గుర్తు చేశారు చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో అన్న మాటలను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ శాఖ ఇన్చార్జి బింగ్ గీత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ వర్కర్స్ వేతనాలు విడుదల చేయాలి



**భద్రాచలం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** భద్రాచలం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటియుసి పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత రెండు నెలల నుండి వేతనాలు రాకపోవటం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు .వెంటనే కార్మికులకు పెండింగ్లో ఉన్నటువంటి వేతనాలను విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని అన్నారు. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ కావున మున్సిపాలిటీ తరహా భద్రాచలం గ్రామపంచాయతీలో పని చేస్తున్నటువంటి కార్మికులకు ఆదివారాన్నింగా ప్రకటించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాయల రాములు గుంజ చెన్నకేశవ పోలిశెట్టి శ్రీనివాస్ గుంజ ఎంకన్న రాయల సాయి పుష్ప చెంచల శ్రీను నాగరాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కారేపల్లి, మధిరలో ఎంపీ నామ పర్యటన



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం బ్యూరో) :** బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం జిల్లా వైరా, మధిర నియోజకవర్గాల్లో స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులతో కలసి విస్తృతంగా పర్యటిస్తారని ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఖమ్మం కార్పొరేషన్ తో పాటు వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి, అప్పాయిగూడెం, రొట్టమాకిరేవు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ తో కలిసి పర్యటించి, ఆయా గ్రామాల్లో నిర్మించిన రైతు వేదికలను నామ ప్రారంభిస్తారు. అనంతరం జెడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజుతో కలసి, మధిర పట్టణంతో పాటు మండలంలోని మహాదేవపురం, చిలుకూరు, ఖమ్మంపాడు, నిధానపురం, మాటూరుపేట, మాటూరు తదితర గ్రామాల్లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొంది. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించి, ఓదారుస్తారని తెలిపింది. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని, కార్య క్రమాలను విజయవంతం చేయాలని ఎంపీ క్యాంప్ కార్యాలయం కోరింది.

# గోశాలకు దాణా వితరణ



**ఖమ్మం గాంధీ చౌక్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** స్థానిక గొల్లగూడెం లోని ఓమ్ శ్రీకృష్ణ గోశాల వారికీ మాఘ బహుళ అమావాస్య(సోమవతి అమావాస్య ) తిథిని పురస్కరించుకొని నగర పెద్దలు,స్థానిక దాల్ మిల్ యజమానులు, గో ప్రేమికులు, సేవా సమితి సభ్యుల ద్వారా సేకరించిన రూ.66,000ల విలువగల గో దాణా కు సంభందించిన పచ్చిగడ్డి, తవుడు, మినప, పెసర, కంది, బొబ్బర చున్నీ, బెల్లం, ఆకుకూరలు, బియ్యం తదితర వస్తువులను శ్రీ స్థంభాద్రి సేవా సమితి వారి ఆధ్వర్యంలో దాతల పక్షనా వితరణ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మి నరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సభ్యులు జంగిలి రమణ, సూరినేటి మల్లేశం, బజ్జూరి రమణారెడ్డి, వంగవీటి నవీన్, వి.వి. సుబ్బారావు, పి. రామ్మోహనరావు, పి. సాయికుమార్, పులిపాటి సంపత్ కుమార్, పసుపులేటి రాజేంద్రప్రసాద్, గజ్జి సూర్యనారాయణ, కుమ్మరకుంట్ల మురళి, సిరికొండ వెంకటేశ్వర్లు, ఇద్దెగాని నాగేశ్వరావు లతో పాటు గోశాల భాద్యులు కేసా హనుమంతరావులు దాతల పేరున గోపూజలు చేయించి, దాతలందరకు ధన్యవాదములు తెలియచేసినారు

# శ్రీరాంనగర్ 13వ నెంబర్‌కు సిసి రోడ్ మంజూరు

## మంత్రి పువ్వాడ హామీ



**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 20(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ లోని శ్రీరాంనగర్ రోడ్ నంబర్ 13తో పాటు డివిజన్ లోని పలు లింక్ రోడ్లను సిసి రోడ్స్‌గా వేయాలని కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. డివిజన్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా వెంటనే 13వ రోడ్ మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలియజేశారు.

# మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి...

## పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి
## – సిఐటియు ఆధ్వర్యంలో పది కిలోమీటర్ల పాదయాత్ర
## – కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించిన గ్రామపంచాయతీ కార్మికులు







**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి) :** గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాల్వంచ మండలం జగన్నాధపురం పెద్దమ్మ తల్లి గుడి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పది కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల తోటి వెట్టిచాకిరి చేయిస్తుందని విమర్శించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం మరియు పండగ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న మూడు నుండి ఐదు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు . పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని బిల్ కలెక్టర్లు, కారోబార్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది .అన్ని పంచాయతీ కార్యాలయాల్లో మహిళా కార్మికులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది .గోదావరి వరదల సందర్భంగా కష్టపడి పని చేసిన కార్మికులకు ఒక నెల వేతనాన్ని ఇన్సెంటివ్ గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పంచాయతీ కార్మికులకు మాత్రమే గోదావరి వరదలు ఇన్సెంటివ్ ఇచ్చి మిగిలిన కార్మికులను విస్మరించడం అన్యాయమని పేర్కొన్నారు బిల్ కలెక్టర్లు, కరోబార్ లకు లకు ప్రత్యేక హోదాను కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో 2021 జనాభా లెక్కల ప్రాతిపదికన కార్మికులను నియమించాలని కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని సిఐటియు డిమాండ్ చేసింది. పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం తగదని అత్యంత అట్టడుగు వర్గాలకు సంబంధించిన కార్మికులు పంచాయతీ కార్మికులని వారి సేవలను మాటల్లో పొగుడుతూ వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకపోతే ఫిబ్రవరి 28వ తేదీన జరుగుతున్న చలో హైదరాబాద్ అనంతరం నిరవధిక సమ్మె నిర్వహిస్తామని కార్మికుల సమ్మె నిర్వహిస్తే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఐటియు నేతలు హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్ అధ్యక్షతన కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా జరిగింది ధర్నా అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిపిఓ కు సమస్యలపై వినతి పత్రాన్ని అందచేసారు. పాదయాత్ర సందర్భంగా పాల్వంచలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థులు పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. జిసిసి హమాలీ యూనియన్ జిల్లా కమిటీ తరుపున ప్రెసిడెంట్ మొగిలి పాదయాత్రకు సంఘీభావాన్ని తెలియజేచారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అలాగే పాల్వంచ భద్రాచలం రోడ్డు హమాలి యూనియన్ హాస్పటల్ సానిటరీ వర్కర్స్ యూనియన్ పాదయాత్రకు మద్దతు ప్రకటించాయి. ఈ పాదయాత్రలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ జిల్లా ఆఫీస్ ఆపీసు బెరర్లు గద్దల శ్రీనివాస్, పిట్టల అర్జున్ , డి వీరన్న, కే సత్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, ఉప్పుతల నరసింహారావు, భూక్య రమేష్, సిఐటియు మండల కన్వీనర్లు బర్ల తిరుపతయ్య, నరసింహారావు, నిమ్మల మధు, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్‌వర్కర్స్ యూనయన్ నాయకులు సాయి రత్న ,శివకృష్ణ, కళ్యాణ్, తోకలు నరేష్, రంగా, పద్మ , జక్కుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్జేసి జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ వేడుకలు






**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** ఖమ్మం ఆర్జేసి జూనియర్ కళాశాల ఫెయిర్ వెల్ పార్టీ వేడుకలు సోమవారం నగరం లోని ఎం.బి. గార్డెన్స్ లో ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ముఖ్య అతిది గా హాజరై మాట్లాడారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిదంగా ఈ విద్యా సంవత్సరం లో పలు విభాగాలలో తమ ప్రతిభ కనబరిచి న విద్యార్థులకు కృష్ణ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల తో శ్రమిస్తే దేనినైనా సాధించ వచ్చు నని అన్నారు. తమ కళాశాల లో విద్య నభ్య సించి ఎంతోమంది సైంటిస్టులు గా,ప్రభుత్వ అధికారులు గా ఎదిగారని తెలిపారు. కళాశాల నుండి 20వేల మంది కి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఆ ఒరవడి ని కొనసాగిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీజీ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.శివ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లక్ష్మీ పతి,వైస్ ప్రిన్సిపాల్ ఎ. లింగయ్య,జూనియర్ కళాశాల ఇంచార్జ్ లుఉపేందర్ రాంబాబు,ఎస్.బి. ఐ.టి. కళాశాల ఎకడమిక్ డైరెక్టర్ శివ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ



**వైరా టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** వైరా మండలంలో గల గరికపాడు, వైరా పట్టణంలో గల ప్రభుత్వ హైస్కూల్స్‌లో విద్య నభ్యసిస్తున్న పదవతరగతి విద్యార్థులకు సోమవారం ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు ట్రైనర్స్ ఎం.డి. ఆశా, ఎస్.కె. ఖాదర్, అజీజ్‌లు ఏప్రిల్ నెలలో జరిగే వార్షిక పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు సంపాదించడానికి అవసరమైన మెళకువలను సూచించారు. అనంతరం శ్రీ బాలాజీ ఎస్టేట్స్, కన్‌స్ట్రక్షన్స్ (ఖమ్మం) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వత్సవాయి రవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాడు, వైరా జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, రంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ మార్కెటింగ్ మేనేజర్ గాలి వెంకటాద్రి, మద్ది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటిలో విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు






**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** ఇంజనీరింగ్ విద్య లో కంప్యూటర్ సైన్స్ విభాగం లో మెండైన అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు కష్టపడుతూ లక్ష్యం దిశగా ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఖమ్మం ఎస్.బి. ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుక సోమవారం ఆహ్లాదకర వాతావరణం లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ అవార్డు గ్రహీత, కె యు.ఈ. సి.మెంబర్ సీతారాం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతక పరిజ్ఞానాన్ని విద్యార్థుల ఎదుగుదల కు వినియోగించు కోవాలని సూచించారు. చెడు కు దూరం గా ఉంటూ ఇప్పటి నుండే మంచి వైపు అడుగులు వేయాలన్నారు. మొదటి సంవత్సరం నుండే విద్యార్థులు వారి లక్ష్యాని కి అనుగుణంగా ప్రయత్నాలను ఆరంభించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం సమాజంలో టివి, సెల్ ఫోన్ వంటి ప్రచార మాధ్యమాల నుండి మంచి ని గ్రహించాలని అన్నారు. చెడువైపు ప్రయాణించకూ డా తల్లిదండ్రుల కోరిక ను నెరవేర్చే లా తయారు కావాలని సూచించారు.అనంతరం మరో అతిథి ఐ టి హబ్ బాద్యులు రాజశేఖర్ మాట్లాడుతూ మనిషి ఆలోచన మహత్తరమైనదని,దీనిలో భాగంగానే సమాజంలో అనేక అద్భుతాలు సృష్టించ బడుతున్నాయన్నారు. విద్యార్థులు ఆ దిశ గా వారి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని అన్నారు. దీనికోసం అధ్యాపకులు అందించే విద్య తో పాటు వారి సలహాలు, సూచనలు అనుసరించాలని సూచించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా ఎస్.బి. ఐ.టి. కళాశాల ను మంచి ఉద్దేశ్యం తో ఏర్పాటు చే శా ఏ ు ని తెలిపారు. దీనిలో భాగంగానే తమ కళాశాల విద్యార్థులు పలు రంగాలలో రాణిస్తూ రికార్డు స్థాయిలో ప్లేస్ మెంట్ లు సాధిస్తున్నారని వెల్లడించారు.ఇవే సహాయ సహకారాలు భవిష్యత్ లో కూడా యాజమాన్యానికి అందించాలని ఆయన కోరారు.అనంతరం కార్యక్రమం లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.చివరగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పలు విభాగాల్లో నిర్వహించిన పోటీ లలో గెలుపొందిన విద్యార్థులకు అతిదు లు బహుమతి ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి. ధాత్రీ, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాస రావు, ఎకడమిక్ డైరెక్టర్స్ డా. ఎ.వి.వి.శివ ప్రసాద్,డా.జి. సుభాష్ చందర్, డా.రవీందర్ బాబు,జి. ప్రవీణ్ కుమార్,హెచ్ ఒ.డి.లు ఎన్.శ్రీనివాస రావు,పి. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.....



## అభివృద్ధి పనులకు సండ్ర శంకుస్థాపన

**సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటుగా నిలుస్తామని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో నూతనంగా 48.3 లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్లకు, 25 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం సింగరేణి వారి సౌజన్యంతో గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, గ్రామంలో 1 కోటి రూపాయలతో నిర్మాణం అవుతున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన గొర్ల వెంకట రెడ్డి గ్రామంలో ఇటీవల చనిపోయిన 8 మంది మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5000 చొప్పున ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చేతుల మీదుగా రూ 50 వేల రూపాయలను అందజేశారు.

## కంటి వెలుగు పేదల పాలిట వరమే

### – కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ గుమ్మడి గాంధీ



**పినపాక, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** పినపాక మండలంలో పోట్లపల్లి గ్రామంలో ప్రైమరీ స్కూల్ నందు జరుగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ సోమవారం సందర్శించారు. ఈ వైద్య శిబిరంలో మందులు, కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ మాట్లాడుతూ పినపాక మండలంలో 19వ తారీకు నుండి ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం ఎంతోమందికి కంటి చూపును ప్రసాదిస్తుందన్నారు. కళ్ళజోళ్ళు కొనలేని పేదవారికి ఈ శిబిరం ఒక వరం లాంటిది అన్నారు. ఇప్పటివరకు మండలంలో 22 కంటి వెలుగు శిబిరాలు నిర్వహించడం జరిగిందని 2977 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 803 కళ్ళజోళ్ళు అందజేశామని తెలియజేశారు. 746 కళ్ళజోళ్ళు అవసరం ఉన్నవారిని గుర్తించామని నెల రోజుల్లో వారికి కూడా కళ్ళజోళ్ళు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాభవాని, డాక్టర్ దినేష్ కుమార్, నేత్ర వైద్యాధికారి సంజీవరావు, డిఇఓ జ్యోతి, ఏఎన్ఎంలు భారతి ,పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి

### – ఎంపీపీ రేగా కాళిక..




**కరకగూడెం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** వేసవికాలం ప్రారంభమవుతుండడంతో గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ రేగా కాళిక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అధికారులు మండల సిబ్బంది అనవసర గ్రామపంచాయతీ సర్పంచులు కార్యదర్శులు సమన్వయం చేసుకుంటూ ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆమె అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గంగా గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకుల ద్వారా వాటర్ సప్లై చేయాలని ఆమె అన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అధికారులు అందరూ సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె కోరారు. ప్రతి అధికారి గ్రామపంచాయతీలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించాలని, ఈనెల 25వ తేదీన జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజా సమస్యల మీద చర్చించడానికి సర్పంచులు సిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికలతో పాటు గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

## బంగారు, వెండి పతకాలు సాధించిన జిల్లా పోలీసు జాగిలాలు

### – ఎస్పీ కార్యాలయంలో జాగిలాలను ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ డాక్టర్ వినీత్ జి



**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పోలీసు జాగిలాలు బంగారు వెండి పతకాలు సాధించడం పట్ల జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి సోమవారం అభినందనలు తెలియజేశారు. తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పోలీస్ జాగిలాలకు గత సంవత్సరం జూన్ మాసం నుండి ఈనెల 16 వ తేదీ వరకు మొయినాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ ఇంటిలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ నందు శిక్షణ ఇప్పించడం జరిగిందని, 8 నెలల శిక్షణ ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిన గ్రేసీ బంగారు పతకాన్ని ,రెండవ స్థానంలో నిలిచిన రీనా కు వెండి పతకాన్ని గెలుచుకున్నాయని ఎస్పీ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించబడిన నార్కోటిక్స్ విభాగంలో శిక్షణ పొందిన ఈ రెండు జాగిలాలు అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలను గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి ఈ సందర్భంగా తెలియజేసారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రేసీ, రీనాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు జాగిలాల సంరక్షణకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి సాయి మనోహర్, ఏఆర్ డిఎస్పీ విజయ్ బాబు, ఆర్ఐలు దామోదర్, సోములు మరియు ఏఆర్ ఎస్సై పెంటోజిరావు, హెడ్ కానిస్టేబుల్ నాగుల్ మీరా(రీనా హ్యాండ్లర్), కానిస్టేబుల్ వెంకటేష్ (గ్రేసీ హ్యాండ్లర్) తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు సాఫీగా, పగడ్బందీగా నిర్వహించాలి

### – జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం బ్యూరో) :** మార్చి 15 నుండి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు సాఫీగా, పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్ మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 15 నుండి మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 4వ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యుస్, మార్చి 6న ఇన్విరాన్ మెంట్ పరీక్షలు, 15 మార్చి నుండి ఇతర సబ్జెక్టుల పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ స్టేట్ బోర్డు, హైదరాబాద్ ఆదేశాలను జారిచేసిన క్రమంలో జిల్లాలో పరీక్షల నిర్వహణకు 63 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇట్టి కేంద్రాల్లో 17,890 మంది మొదటి, 17,967 రెండవ సంవత్సరం మొత్తంగా 35,857 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షల ప్రశ్నపత్రాల భద్రపర్చుటకు పటిష్ట ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు పరీక్షా కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ చేయాలని, పరీక్షల సమయంలో సమయానికి పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గదిలో సిసి కెమెరా ల నిఘాలో ఉన్నట్లు స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో అనుమతించకూడదని ఆయన తెలిపారు. త్రాగునీరు, కనీస మౌళిక సదుపాయాల కల్పన చేయాలని, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన తెలిపారు. కేంద్రం దగ్గర్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆయన అన్నారు. కేంద్రం లోపల, పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలు ఎలాంటి లోటుపాటు లేకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఆర్. శిరీష, జెడ్పి సిఇఓ వివి. అప్పారావు, జిల్లా ఇంటర్ మీడియట్ అధికారి రవిబాబు, ఎస్బి ఏసిపి డి. ప్రసన్నకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఇ. సోమశేఖరశర్మ, జిల్లా వైద్యాధికారి డా. బి. మాలతి, ఆర్సీవోలు జ్యోతి, ప్రత్యుష, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకుబండ్‌లో జాటోతు ఠాను నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి



**కల్లూరు టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు ఠాను నాయక్ విగ్రహ ప్రతిష్ట ఖమ్మం నగరం లకారం ట్యాంకుబండు నందు ప్రతిష్ఠించాలని కోరుతూ సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం కల్లూరు పట్టణ పరిధిలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించినటువంటి గిరిజన ఐకాన్ కామ్రేడ్ ఠానునాయక్ నిజాం నిరంకుశత్వం పాలనకు వ్యతిరేకంగా ఆనాడు కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకొని పేద ప్రజలకు లక్షలాది ఎకరాల భూమిని పంచిపెట్టిన సాయుధ పోరాటంలో కామ్రేడ్ ఠాను నాయక్ ఒకరు గిరిజన బంజారా వర్గంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్న మొట్టమొదటి కుటుంబం వారిది దళంలో పనిచేస్తూ రహస్య జీవితాన్ని గడుపుతూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ కూడగట్టి గిరిజన ప్రజలు ఏకం చేసి భూ పోరాటం చేసి సాయుధ పోరాటంలో పాల్గొని నిజాం పాలకులతో వీరోచితంగా పోరాడి ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో తన ప్రాణాలను ప్రజల కోసం అర్పించిన మహనీయుడు ఠాను నాయక్ అటువంటి మహనీయుని విగ్రహ ప్రతిష్ట ఖమ్మం నగరం నందు ప్రతిష్టించుకుందామని పిలుపునిస్తూ కల్లూరు నగరంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తూ కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్, సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శివ నాయక్, ఉపాధ్యక్షులు కొర్ర నరసింహా నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోతు హుస్సేన్ నాయక్, రవీంద్ర, అరవింద్,బాలాజీ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, అభయ హస్తం అమలుకై పోరాడుదాం

## – ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ డిమాండ్




**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** మాట తప్పను మడమ తిప్పను అన్న కేసీఆర్ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టగానే డ్వాక్రా మహిళలకు టోకరా వేస్తున్న ప్రభుత్వ వైఖరిపై పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించి, తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం కలెక్టరేట్ ముందు వందలాదిమంది మహిళలతో భారీ ధర్నా ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోకినపల్లి లలిత అధ్యక్షతన జరిగిన సభలో, చంద్ర అరుణ ప్రసంగిస్తూ డ్వాక్రా మహిళలు తమ కష్టార్జితంతో వేల కోట్ల రూపాయలు పొదుపు చేసి, బ్యాంకులో జమ చేసి,రుణాలు పొందుతున్నారు. ప్రతి నెలా వారం లోపు 12 శాతం వడ్డీ చెల్లిస్తున్నారన్నారు . మహిళలను కోటీశ్వర్లు చేస్తానని నోటి కాడ కూడును గుంజు కపోవడం రాష్ట్ర ప్రభుత్వ దోపిడి విధానాలలో భాగమని ఆమె అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం మాత్రం తిరిగి వడ్డీ డబ్బులు ఇవ్వకుండా, నిర్లక్ష్య వైఖరి చూపిస్తుందన్నారు . వడ్డీ లేని రుణాలు నయా పైసా కూడా ఇవ్వలేదన్నారు . అభయ హస్తం పథకం కింద సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, పథకం అమలు చేయకుండా, వారి డబ్బు తిరిగి ఇవ్వకుండా, ప్రభుత్వం మహిళలను దగా చేస్తుందన్నారు . పొదుపు చేసిన సంఘాలకు రివాల్వింగ్ ఫండు ఇవ్వటం లేదనీ . 10 లక్షల వరకు ఇస్తామన్న వడ్డీ రుణాలు, వట్టిమాటగా మిగిలిందన్నారు . ఆమ్ ఆద్మీ ద్వారా సభ్యురాలి పిల్లల చదువులకిచ్చే స్కాలర్షిప్ప,సభ్యురాలు మరణిస్తే ఇవ్వాల్సిన ఆర్థిక సహాయం, జీవనజ్యోతి,ఎస్సీ, ఎస్టీ మహిళకు ఇచ్చే రాయితీ, ఇన్సూరెన్స్ తదితర స్కీంలన్నింటికీ టిఆర్ఎస్ ప్రభుత్వం సున్నా చుట్టిందన్నారు . పథకం ద్వారా




ఆర్థిక అభివృద్ధి లేదుగానీ,మహిళలు మరింత అప్పుల పాలయ్యారనీ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ లేని రుణాలు వస్తాయని ఆశించి,కొద్ది మంది మహిళలు తీసుకున్న అప్పులు తిరిగి నూటికి నూరు శాతం బ్యాంకులకు సకాలంలో బకాయిలు చెల్లిస్తున్నారనీ ఆమె అన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయహస్తం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి ప్రసంగిస్తూ చనిపోయిన సభ్యురాలి బకాయిలను రద్దు చేయాలనీ,ఎస్సీ ఎస్టీ మహిళలకు ఇచ్చే రాయితీ అమలు చేయాలనీ,ఆమ్ ఆద్మీ, జీవనజ్యోతి, నేషనల్ రూరల్ లైవ్లి హుడ్ మిషన్,ఇన్సూరెన్స్ తదితర స్కీములన్నీ అమలు చేయాలనీరాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు హాజరై ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపు విధానాలపై రాజీలేని పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం జిల్లాకార్యదర్శి టీ ఝాన్సీ లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ఆవుల మంగతాయి, జిల్లా కోశాధికారి శీలం పూలమ్మ, గోకినపల్లి సరోజిని,గుడుచుట్టు వసుమతి, బందెల లలిత,ఇస్లావత్ స్వాతి, గంటా వెంకట నరసమ్మ, అమర్లపూడి కోటమ్మ, పరిమళ, నీల, చైతన్య, కొట్టె సత్యవతి, ఎస్.కె షాన్,కే భారతమ్మ, కంప సాటి మమత, టి సరోజినీ, సుగుణమ్మ జే వనిత, కేలోత్ బుజ్జి, పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఐడిఓసి కార్యాలయంలో బయోమెట్రిక్ అమలు

## – జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి) :** ఐడిఓసి కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సోమవారం ఐడిఓస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండిసమస్యల దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హామీ మేరకు పాల్వంచ, మణుగూరు మున్సిపార్టీలలో చేపట్టనున్న పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. పాల్వంచలోని చింతలచెరువును టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు కార్యాచరణలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చింతలచెరువు బ్యూటిఫుల్ పిక్నిక్ స్పాట్ కావాలని, పాల్వంచకు ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తయారు చేయుటకు ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కార స్వభావాన్ని పోర్టల్లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు ... పాల్వంచ మండలం, రంగాపురం గ్రామపంచాయతీకి చెందిన బానోత్ బోజ్య రంగాపురం రెవిన్యూ నందు సర్వే నెం. 3/1లో 4 ఎకరాల భూమి ఉన్నదని, వారసత్వంగా ఆ భూమిని తన కుమారుడు బానోత్ వలమాకు వాటాగా ఇచ్చానని, ఆ భూమిని అతని పేరుమీదకు మార్చి సర్వహక్కులు కల్పించడంతో పాటు రైతుబంధు వచ్చే విధంగాచర్యలు తీసుకోవాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం ధరణి కో ఆర్డినేటర్కు ఎండార్స్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన టి నాగేశ్వరి పాల్వంచలోని కెఎస్ఆర్ కళాశాలలో ఫార్మా డిలో ఉచితసీట్ వచ్చిందని, తదుపరి జరిగిన కౌన్సిలింగ్ తనకు యంఎస్ఆర్ వైద్య కళాశాలలో బిహెచ్ఎంఎస్ సీటువచ్చిందని, ఒరిజినల్ సర్టిఫికేట్లు కావాలని కెఎల్అర్ కళాశాలలో దరఖాస్తు చేయగా లక్షా 50 వేల రూపాయలుచెల్లించాలని చెప్తున్నారని, నిరుపేద కుటుంబానికి చెందిన నేను అంత ఫీజు చెల్లించే స్థితిలో లేనని, కావున తన ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం పాల్వంచ తహసిల్దార్కు ఎండార్స్ చేశారు. చంద్రుగొండ మండలం, తిప్పనపల్లి గ్రామానికి చెందిన కళ్లెం అనంతరాములు 10 సంవత్సరాల నుండి అక్కడే నివాసం ఉంటున్నానని, తనకు తెల్ల రేషన్కార్డు ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలునిమిత్తం జిల్లా పౌర సరఫరాల అధికారికి ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాల్టీ, ఆదర్శనగర్కు చెందిన తమ్మిశెట్టి దుర్గ సిసి రేకులతో ఇల్లు నిర్మించుకున్నామని, ఆ ఇంటికి ఇంటి నెంబర్ కేటాయించాలని మున్సిపార్టీలో దరఖాస్తు చేశామని, ఇంతవరకు ఇంటినెంబర్ కేటాయించలేదని, కావున తనకు ఇంటినెంబర్ కేటాయించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం మున్సిపల్ కమిషనర్కు ఎండార్స్ చేశారు. అశ్వారావుపేట మండలం, గ్రామానికి చెందిన మంపాటి రవి అశ్వారావుపేట రెవిన్యూ పరిధిలోని సర్వే నెం. 911లో 4 ఎకరాలు సాగు చేస్తున్నానని, ఆ భూమికి పట్టా మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం ఆర్ఓఎఫ్ ఆర్ డిటి భద్రాచలంకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అమరబోయిన శివరాం మృతికి యాదవ మహాసభ నివాళి

### ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

### ఆయన మృతి యాదవ మహాసభకు తీరని లోటు

### అమరబోయిన శివరాం ప్రసాద్ సంస్మరణ సభలో వక్తల నివాళి




**ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 20(మనం న్యూస్) :** అమరబోయిన శివరాం ప్రసాద్ ఉపాధ్యాయుడిగానే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు , యూటీఎఫ్ నేత, అఖిల భారత యాదవ మహాసభ నాయకులు అమరబోయిన శివరాం ప్రసాద్ సంస్మరణ సభ సోమవారం ఖమ్మం బ్యాంక్ కాలనీలోని ఆయన స్వగృహంలో యాదవ మహాసభ జిల్లా నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక స్పృహ ఉన్న ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు.ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు ప్రసంశనీయమన్నారు. ఉపాధ్యాయ సంఘం నుంచి ఆయన విస్తృతమైన సేవలు అందించారని పేర్కొన్నారు.సంఘ కార్యక్రమాల్లో ఎంతో చురుకైనా పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన మృతి ఉపాధ్యాయ సంఘానికే కాకుండా యాదవ మహాసభకు తీరని లోటన్నారు. ఆయన సేవల సూర్తితో ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని వక్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సంస్మరణ సభలో మహాసభ రాష్ట్ర నాయకులు మేకల మల్లిబాబు, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్య యాదవ్, సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఉస్మానియా జేఏసీ నాయకులు గంగరేవుల లోకేష్ యాదవ్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణ్, మచ్చా శ్రీనివాస్ యాదవ్, నాగ సీతారాములు యాదవ్, దొంగల తిరుపతిరావు, మాచర్ల భారతి, హైమావతి, విజయభాయి, మృతుని భార్య అమరబోయిన అంజని, కుమార్తె రచన, కుమారుడు కోవిద్ కృష్ణ, పాల్గొన్నారు.



# నరేన్ జిమ్మును సందర్శించిన ఎంపీ రవిచంద్ర

**ఖమ్మం, ఫిబ్రవరి 20(మనం న్యూస్) :** స్థానిక మమత రోడ్ లోని సతీష్ ఏర్పాటు చేసిన నూతన నరేన్ జిమ్మును సోమవారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యువకులు దేహ దారుఢ్యం కోసం జిమ్మును ఏర్పాటు చేయడం అభినంద నీయమని అన్నారు ఆరోగ్యం పరిరక్షించుకోవడం కోసం యువకులు ప్రత్యేకంగా కృషి చేయవలసి ఉంటుందన్నారు వారి వెంట కార్పొరేటర్ కూరాకుల వల్లరాజు, పూర్ణచంద్రరావు, ఇస్మాయిల్, పోతుల వెంకటేశ్వర్లు, నర్సింగ్ రంగారావు, నాన్న బాల హరీష్ తదితరులు పాల్గొన్నారు



# పాఠశాలల అభివృద్ధి పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలి

**– జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్**



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం బ్యూరో) :** మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మన ఊరు–మన బడి కార్యక్రమ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన ఊరు– మన బడి కార్యక్రమం క్రింద జిల్లాలో 426 పాఠశాలలను మొదటి విడత లో ఎంపిక చేసి, మరమ్మత్తులు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 15 శాతం పాఠశాలల పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేసుకొని, ప్రారంభించుకున్నట్లు ఆయన అన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని, పనులు దగ్గరుండి పూర్తి చేయించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పనులు పూర్తయిన వరకు ఎంబి రికార్డులు నమోదు చేసి, ఎఫ్టిఓలు జనరేట్ చేయాలన్నారు. పనుల పూర్తిలో 29 శాతమే నమోదులు చేసినట్లు ఆయన తెలిపారు. రికార్డు నమోదు చేయకపోవడం, ఎఫ్టిఓలు జనరేట్ చేయక పోవడంతో చెల్లింపులు ఆలస్యం అవుతున్నట్లు ఆయన అన్నారు. మంజూరు అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. పనులు ఈ విద్యా సంవత్సరం లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ వివి. అప్పారావు, జిల్లా విద్యాధికారి ఇ. సోమశేఖరశర్మ, డిఆర్డీఓ విద్యాచందన, వివిధ ఇంజనీరింగ్ శాఖల ఇఇలు, డిఇలు, ఏఇలు, మండల విద్యాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికం

**– వైఎస్సార్ టిపి వైరా నియోజకవర్గ అధ్యక్షులు ధర్మసోతు రామ్ నాయక్**



**ఏన్కూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ టిపి అధ్యక్షురాలు షర్మిలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్ టిపి వైరా నియోజకవర్గ కోఆర్డినేటర్ ధర్మసోతు రామ్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పార్టీ మండల అధ్యక్షుడు వై.మాధవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ షర్మిల అరెస్టును ఖండిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ నాయక్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ లో ప్రజల కష్ట, సుఖాలు తెలుసుకుంటూ శాంతియుతంగా పాదయాత్ర నిర్వహిస్తున్న షర్మిలమ్మను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. షర్మిలమ్మ పాదయాత్రను చూసి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందని, షర్మిలమ్మకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టిపి నాయకులు గజేంద్ర సైదులు, శీలం మాధవరెడ్డి, జూపాటి వెంకటరాజు, జక్రయ్య, బోద నరసింహాలాల్, రేళ్ళ సుజాత, తరుణ్ రెడ్డి, భాస్కర్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# కామంచికల్‌లో బీఆర్ఎస్ ఆగడాలు

**– సిపిఐ కార్యకర్త గడ్డివాముకు నిప్పు**
**– ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**
**– అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు**



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** సిపిఐ పార్టీకి చెందిన ఓ కార్యకర్త గడ్డివాముకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు నిప్పంటించారు. ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలం కామంచికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త బొప్పి ఉపేందర్ తన పొలంలో 250 కట్టల గడ్డివామును ఉంచాడు.సోమవారం ఉదయం జాలరులు ఏటికి వెళుతున్న క్రమంలో గడ్డివాము దగ్ధం అవ్వడాన్ని చూసి అతనికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని కాలిపోతున్న గడ్డివామును చూసి తీవ్ర ఆవేదన చెందాడు. సుమారు రూ.60వేల మేర నష్టం వాటిల్లిందని వాపోయాడు. దీనిపై గ్రామ ఉపసర్పంచ్ బొప్పి ప్రభాకర్, టిఆర్ఎస్ నాయకులు ప్రతాపనేని భరత్ ,జంగాల ఉపేందర్, జంగటి వినోద్, బోయినపల్లి రాకేష్ పై అనుమానితులుగా రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోటు ప్రసాద్ :**
విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా నాయకులు హనుమంతు రాము ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోటు మాట్లాడుతూ... పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ అంచలంచలుగా ఎదుగుతున్న బొప్పి ఉపేందర్ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇటువంటి దుశ్చర్యకు పాల్పడటం సరికాదన్నారు. తమ పార్టీ భిక్షతో సర్పంచ్ , ఉప సర్పంచులు గా గెలుపొంది నేడు డబ్బుల కోసం బీఆర్ఎస్ పార్టీ పంచన చేరి గ్రామంలో అలజడి సృష్టించడాన్ని తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. మీరు కన్నతల్లి లాంటి కమ్యూనిస్టు పార్టీని మోసం చేసి మీరు మారినంత మాత్రాన సిపిఐ కార్యకర్తలు మారాలి అని ఇటువంటి అలజడులు సృష్టించి సిపిఐ ని బలహీనపరచలేరన్నారు. సిపిఐ కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసాని కల్పించారు. సిపిఐ కార్యకర్తలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీటీసీ కలింగ మోహన్ రావు, సిపిఐ నాయకులు కొనకొండ్ల శ్రీనివాసరావు, గ్రామ సెక్రెటరీ బొప్పి గాంధీ ,సహాయ కార్యదర్శి జంగాల ఉపేందర్ ,దేవరపల్లి వెంకటకృష్ణ, వార్డ్ మెంబర్ ఉపాధ్యాయ ,ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉసికల రవి తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహించిన బీసీ గురుకుల ప్రిన్సిపాల్ నసీమా బేగం సస్పెన్షన్



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** విధుల నిర్వహణలో వైఫల్యం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, సరుకుల దుర్వినియోగం పై మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ఎర్రుపాలెం ప్రిన్సిపాల్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎండి. నసీమా బేగం ను సస్పెన్షన్ విధిస్తూ, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శి డి. మల్లయ్య బట్టు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కార్యదర్శి అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానం విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో ఆయన ఆదేశించారు. బెల్లంపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ జి. నిరోషాను ఎర్రుపాలెం మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు బదిలీ చేస్తున్నట్లు మరో ఉత్తర్వుల్లో కార్యదర్శి పేర్కొన్నారు.

# స్థానిక సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ఒక్క రోజు నిరాహారదీక్ష



**పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** పాల్వంచ మండలంలోని పాండురంగాపురం గ్రామ పంచాయతీపరిధిలోనిసుమారు 70 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న గ్రామ ప్రజలు పాండురంగాపురం రెవెన్యూ పరిధిలోఉన్నటువంటి2018 సంవత్సరం నుండిరెవెన్యూ రికార్డు వ్యవస్థ రద్దు చేయడం వలన అనుభవదారుడు కాలమునుండి పహాని నకలు ఇవ్వడం లేదని దానివల్ల గ్రామ ప్రజలు అన్ని రకాల హక్కులను కోల్పోతున్నామని ధరణి 2018 చట్టం సాదా బైనమాకు వీలు లేకుండా పోయింది దీనివలన పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేసి పహని లేక పోవడం వలన రైతులకు బ్యాంకు లోన్లు మాఫీ కావడం లేదు.పామాయిల్ మొక్కలు డ్రిప్ సబ్సిడీ రావడం లేదు రెవెన్యూ భూమిని మొత్తం నిషేధిత జాబితాలో చేర్చడం వలన ధరణి 2018 రద్దు చేసి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకం ఇచ్చి కేటీపీఎస్ కర్మాగారం నుండి సి ఎస్ ఆర్ పాలసీ నిధులను ప్రభావిత గ్రామాలకు మంజూరు చేసి అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రైతులకు క్రాఫ్ లోన్లు మాఫీ మపిచేయాలి.రెండో విడత గొర్రెల పంపిణీచేయాలి.కేటీపీఎస్ పొల్యూషన్ నివారించుటకు చర్యలు చేపట్టాలని దాసరి రమేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమం లో దాసరి రమేష్ వైస్ ఎంపీపీ గురవయ్య,కోటి తిరుపతయ్య,దేశ బోయిన శ్రీరాములు,ఉప్పయ్య, భద్రయ్య,జన్నారెడ్డి ,వెంకటరెడ్డి,వీరస్వామి,వెంకటయ్య పాల్గొన్నారు.కార్యక్రమానికి ప్రజా సంఘాలు కుల సంఘాలు పార్టీ నాయకులు యువకులు పూర్తి మద్దతు తెలియజేశారు

# కొత్తగూడెంలో ఈ నెల 24, 25 తేదీల్లో అప్రెంటీషిప్ అవేర్ నెస్ కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి) :** ఈ నెల 24, 25 తేదీలలో రెండు రోజులు ఐ.టి.ఐ పాస్ అయిన అన్ని ట్రేడ్ ల అభ్యర్థులకు అప్రెంటీషిప్ అవేర్నెస్ వర్క్ షాప్ ను కొత్తగూడం లో నిర్వహించి నున్నామని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపాల్ జి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు 24 తేదీ నాడు ఇల్లందు గెస్ట్ హౌస్, నియర్ ఇల్లందు క్రాస్ రోడ్, కొత్తగూడెంనందు డెలిగేట్స్ మీటింగ్ జరగనున్నట్లు తెలిపారు. దీనిలో సెంట్రల్ మరియు స్టేట్ స్టేక్ హోల్డర్స్ ఇండస్ట్రీస్, ఎన్ఎస్టిసి,ఎస్సెస్సీ, జెఎస్ఎస్ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ తెలంగాణ స్టేట్ ఎఎఎ, జెఎఎ, ఆఫ్ డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ టిపిఎ ఎంజిఎంఎఫ్ టెక్నికల్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అథారిటీస్, ఎమ్మెస్ ఎం ఇ కమిషనరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ డీఎసి బి ఓ ఏ టి తోపాటు జిల్లా కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు. ఈ అప్రెంటీషిప్ అవేర్నెస్ కార్యక్రమం ఉదయం 9 30గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. రెండవ రోజు 25 నాడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకుప్రభుత్వ ఐ.టి.ఐ. కొత్తగూడెం క్యాంపస్ నందు జరుగు అప్రెంటీషిప్ అపర్నెస్ వర్క్ షాప్ కు ఎంపిక అయిన డెలిగేట్ లతో పాటు ప్రభుత్వ ఐ.టి.ఐ. కొత్తగూడెం, కృష్ణసాగర్/ భద్రాచలం కు చెందిన ఐ.టి.ఐ. అభ్యర్థులు పాల్గొంటారని రమేష్ తెలిపారు.

# మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా




**పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాల్వంచ మండలం జగన్నాధపురం పెద్దమ్మ తల్లి గుడి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పది కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల తోటి వెట్టిచాకిరి చేయిస్తుందని విమర్శించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం మరియు పండగ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న మూడు నుండి ఐదు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు . పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని బిల్ కలెక్టర్లు, కారోబార్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది.అన్ని పంచాయతీ కార్యాలయాల్లో మహిళా కార్మికులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి కార్మికుడికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది .గోదావరి వరదల సందర్భంగా కష్టపడి పని చేసిన కార్మికులకు ఒక నెల వేతనాన్ని ఇన్సెంటివ్ గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పంచాయతీ కార్మికులకు మాత్రమే గోదావరి వరదలు ఇన్సెంటివ్ ఇచ్చి మిగిలిన కార్మికులను విస్మరించడం అన్యాయమని పేర్కొన్నారు.బిల్ కలెక్టర్లు, కరోబార్ లకు లకు ప్రత్యేక హోదాను కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో 2021 జనాభా లెక్కల ప్రాతిపదికన కార్మికులను నియమించాలని కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని సిఐటియు డిమాండ్ చేసింది.పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం తగదని అత్యంత అట్టడుగు వర్గాలకు సంబంధించిన కార్మికులు పంచాయతీ కార్మికులని వారి సేవలను మాటల్లో పొగుడుతూ వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకపోతే ఫిబ్రవరి 28వ తేదీన జరుగుతున్న చలో హైదరాబాద్ అనంతరం నిరవధిక సమ్మె నిర్వహిస్తామని కార్మికుల సమ్మె నిర్వహిస్తే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఐటియు నేతలు హెచ్చరించారు.గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్ అధ్యక్షతన కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా జరిగింది ధర్నా అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిపిఓ కు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. పాదయాత్ర సందర్భంగా పాల్వంచలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థులు పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు.జిసిసి హమాలీ యూనియన్ జిల్లా కమిటీ తరుపున ప్రెసిడెంట్ మొగిలి పాదయాత్రకు సంఘీభావాన్ని తెలియజేచారు.ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అలాగే పాల్వంచ భద్రాచలం రోడ్డు హమాలి యూనియన్ హాస్పటల్ సానిటరీ వర్కర్స్ యూనియన్ పాదయాత్రకు మద్దతు ప్రకటించాయి.ఈ పాదయాత్రలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ జిల్లా ఆఫీస్ ఆపీసు బెరర్లు గద్దల శ్రీనివాస్,పిట్టల అర్జున్ ,డి వీరన్న ,కే సత్య,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్,ఉప్పు తల నరసింహారావు,భూక్య రమేష్,సిఐటియు మండల కన్వీనర్లు బర్ల తిరుపతయ్య, నరసింహారావు,నిమ్మల మధు, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్వర్కర్స్ యూనయన్ నాయకులు సాయి రత్న ,శివకృష్ణ, కళ్యాణ్,తోకలు నరేష్,రంగా, పద్మ ,జక్కుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# బీ.ఆర్.ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్



**మధిర, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో బీ.ఆర్.ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్, బీ.ఆర్.ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు పాల్గొని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి రిబ్బన్ కట్ చేసి హెల్త్ క్యాంప్ ప్రారంభించారు. క్యాంప్ లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు స్వయంగా వైద్య పరీక్షలు చేపించుకొని ఏర్పాట్లు పరిశీలించారు. హైదరాబాద్ లోని యశోదా హాస్పిటల్స్ వారి సహకారంతో గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు దెందుకూరు బీ.ఆర్.ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఈ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యాంప్ లో గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటుగా చికిత్స చేసి తగిన మందులు అందించడం జరుగుతుంది. హెల్త్ క్యాంప్ ప్రారంభించిన అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు క్లాస్ రూమ్ కు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు నేరుగా వెళ్లి విద్యార్థులతో మాట్లాడి 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చదవాలని చదువుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ ఎంపిటీసీ సభ్యురాలు అల్లు రమాదేవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అమిరినేని వెంకటేశ్వరరావు, నాయకులు కొల్లూరు శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు అబ్బూరి రామన్, పార్టీ కార్యదర్శి పగిడిపల్లి ఉద్దండ్, పార్టీ విద్యార్థి సంఘం నాయకులు వాల్మీకి పవన్, బన్ను, బుగ్గినేని ప్రవీణ్, వూట్ల నవీన్, గుర్రం అచ్చయ్య, శివ, నాగబాబు, బ్రహ్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ లత

**మధిర టౌన్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):**
మధిర మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మరియు మినీ ట్యాంక్ బండ్ పనులను సోమ వారం పరిశీలించిన మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధిర నందు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ,మినీ ట్యాంక్ బండ్,నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు ఇంకా పట్టణంలో పలు చోట్ల పార్కులు, సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు మరియు మధిర మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 30 కోట్లు నిధుల మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్కి, మున్సిపల్ మరియు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కి, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి, పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు కి, మధిర నియోజవర్గ ఇంచార్జ్



ఖమ్మం జిల్లా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ కమిషనర్ రమాదేవి , ఏఈ నరేష్ రెడ్డి , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు మధిరలో బీఆర్ఎస్ లోక్‌సభ ఫ్లోర్ లీడర్, ఖమ్మం ఎంపీ నామ పర్యటన



**మధిర, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):**
నేడు మధిర మండలం మరియు టౌన్ లో బీఆర్ఎస్ పార్టీ లోక్ సభ ఫ్లోర్ లీడర్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పర్యటించనున్నారు అందులో భాగంగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు తో కలసి మధిర టౌన్ తో పాటుగా మండలంలోని మహాదేవపురం, చిలుకూరు, ఖమ్మంపాడు, నిధానపురం, మాటూర్ పేట, మాటూర్ గ్రామాల్లో పర్యటిస్తారు.

# రేగళ్ల శ్రీను భౌతికకాయానికి తాతా సుధాకర్ ఘన నివాళి

**కొణిజర్ల, ఫిబ్రవరి 20 (మనం న్యూస్ ):**
ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త రేగళ్ల శ్రీను అనారోగ్యంతో ఆదివారం మరణించినారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు మృతుని గృహానికి వెళ్లి రేగళ్ల శ్రీను భౌతిక ఖాయంపై తెలుగు దేశం పార్టీ జండా కప్పి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి, దైర్యంగా ఉండాలని సూచించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీను సేవలను కొనియాడి నమ్మకమైన మంచి కార్యకర్తను కొల్పోయామని తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని తన ప్రగాఢ సానుభూతి తెలిపారు . ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షులు



తాతా సుధాకర్, దోమ శ్రీనివాసరావు, చింతల రాంబాబు, చిట్టి శ్రీనివాసరావు, సురేష్, వెంకయ్య, వెంకన్న, కృష్ణయ్య, మోతుకూరు ఆంజనేయులు, వెంకన్న, నర్సయ్య, కొమ్మిని సత్యనారాయణ, తదితరులు ఉన్నారు .

# ఏఐసీసీ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే వీరయ్య



**భద్రాచలం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సభ్యులుగా భద్రాచలం స్థానిక శాసనసభ్యులు పొదెం వీరయ్యను నియమిస్తున్నట్లు ఏ ఐ సి సి అధ్యక్షులు మల్లికార్జున కార్గే ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిలభారత కాంగ్రెస్ పార్టీ సభ్యులుగా ఎన్నికైన శాసనసభ్యులు పొదెం వీరయ్య ని కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

## ప్రజాక్షేత్రంలో మూడు సంవత్సరాల అభివృద్ధిని స్వయంగా వార్డులలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియనాయక్



**– ఇల్లందు మున్సిపాలిటీ వార్డు లలో విస్తృతంగా పర్యటిస్తు ప్రజా అభిప్రాయ సేకరణ చేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్.**
**– అభివృద్ధి పనుల్లో భాగంగా ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీలపై దృష్టి సారిస్తున్న యంత్రాంగం**
**– ఇల్లందు మున్సిపల్ వార్డులలో భార్యల అధికారం. భర్తల పెత్తనం? సంతకాలకు తప్ప దేనికి పనికిరాన వార్డు కౌన్సిలర్లు పెత్తనం చెలాయింపంత మహిళా కౌన్సిలర్ల భర్తలది**
**– ఐటీ శాఖ మాత్యులు కేటీఆర్ స్వయంగా చెప్పారు.**
**– నేను ఐటీ శాఖ మినిస్టర్ అయితే నా భార్య కూడా మినిస్టర్ ఏనా అని అయినా మారని ఇల్లందు మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల భర్తల తీరు**

**ఇల్లందు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
ఇల్లందు మున్సిపాలిటీ లో మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు కు మున్సిపల్ కౌన్సిలర్లకు గత 15 రోజులుగా జరుగుతున్న అవిశ్వాస తీర్మానం తో పాటు వారిపై ఒకరి అభియోగాలను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే హరి ప్రియ నాయక్ విభేదాలకు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలలో భేదాలు రావడానికి గల కారణాన్ని స్వయంగా 24 వార్డులలో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ పర్యటించి క్షేత్రస్థాయిలోని ప్రజల తో మమేకమై అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువస్తూ టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి దోహదపడుతూ అంతర్గతంగా మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లకు జరుగుతున్న వివాదాల కారణాలు అన్వేషిస్తు వివాదాలకు తెరదింపడానికి రాజనీతి మార్గంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, అంతర్గత ప్రతి వార్డులో ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే. ప్రజల చెంతకే పరిపాలన అనే నానుడిని ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియ నాయక్ నిజం చేస్తూ మున్సిపాలిటీలోని 24 వార్డులలో పర్యటనకు శ్రీకారం చుట్టారు.అదేవిధంగా నిన్న 8 వార్డులలో విస్తృతంగా పర్యటించారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. వార్డులలో మహిళా కౌన్సిలర్లు పేరుకే ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు పూర్తి బాధ్యతలు మొత్తం భర్తలు నిర్వహిస్తూ షాడో కౌన్సిలర్లుగా కొనసాగుతున్నారు కనీస మర్యాదను కూడా మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అధికారుల సమక్షంలోనైనా బాధ్యతగా నడుచుకోవాలని కనీస గౌరవాన్ని కూడా మరిచిపోయి వార్డు కౌన్సిలర్ ని పక్కన పెట్టి వారు వ్యవహరించడం సూచనీయంగా ఉందని వార్డు ప్రజలు వాపోతున్నారు. గట్టిగా మాట్లాడితే మాకు వచ్చే పెన్షన్లను తీసివేయడం, లేకపోతే మాకు ఎటువంటి ప్రభుత్వ పథకాలను అందకుండా చేయడం షాడో కౌన్సిలర్ల వ్యవహరిస్తున్న తీరని కొందరు అరాచకానికి బలియే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఏదైనా సమస్యనుపరిష్కరించేదిశగానిర్ణయాలుతీసుకుంటున్నారు.అదేవిధంగా త్వరలోనే ఇల్లందు ప్రజల 60 సంవత్సరాల చిరకాల వాంఛైన బస్ డిపో పనులు పూర్తయ్యాయని, ప్రారంభానికి త్వరలోనే రాష్ట్ర మంత్రివర్యులు వస్తారని తెలిపారు. గ్రామీణ రహదారులు కూడా ప్రయాణం ఇక సులభతరం కానుందని, ప్రజలు ఎలాంటి ప్రయాణ కష్టాలు లేకుండా బస్సుల ద్వారా తమ ఊర్లకు సంతోషంగా చేరుకోవచ్చన్నారు. ఈ పర్యటనలో వార్డు అధ్యక్షుడు రేఖ రవిశంకర్, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎన్నికల రాజేందర్, ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాష. మున్సిపల్ కమిషనర్. మున్సిపల్ సిబ్బంది టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాలు స్థానికులు పాల్గొన్నారు.

## షర్మిల పాదయాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం

**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైయస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకురాలు అధినేత వైయస్ షర్మిల ప్రజాప్రస్థానం పేరిట పాదయాత్ర చేపట్టి అప్రజ స్వామి కంగా బిఆర్ఎస్ నాయకులు పాదయాత్రను అడ్డుకుంటున్నారని ఇది సమంజసం కాదని వైయస్ఆర్ టి పి మండల నాయకులు వనపర్తి మధుసూదన్ రావు పేర్కొన్నారు సోమవారం దమ్మాయి గూడెం లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ షర్మిల పాదయాత్రనకు వస్తున్న స్పందన చూసి టిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోవడంలేదన్నారు పాలక ప్రభుత్వం ఓర్వలేక పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ సమావేశంలో దిద్దు వంశీ వనపర్తి రామకృష్ణ బాలాజీ నాగరాజు సంజీవ్ వర్మ గోకినపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ముత్యాలమ్మ తల్లి పున : ప్రతిష్ఠ మహోత్సవం



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి పునః ప్రతిష్ఠ మహో త్సవం కార్యక్రమం జరుగుతుండగా హోమంలో పాల్గొన్న బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లికొండ వెంకటనారాయణ , ఉప్పలమ్మ దంపతులు ఏ ముత్యాలమ్మ పునం ప్రతిష్ఠ ప్రతిష్ఠ కు అడగగానే ఆర్థిక సాయం అందజేసిన పాలేరు శాసనసభ సభ్యు లు కందాల ఉపేందర్ రెడ్డి కి అభినందనలు తెలిపిన గువ్వల గూడెం గ్రామస్తులు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన భట్టి విక్రమార్క, లింగాల కమల్ రాజ్

**– బంగారు తల్లి పథకంతో పేదింటి కుటుంబాల్లో వెలుగూ నింపింది కాంగ్రెస్సే**
**– కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో భట్టి విక్రమార్క**
**– బడ్జెట్ పెరిగింది తప్పా.. కళ్యాణ లక్ష్మి పథకం నిధులు పెరగలేదు**



**బోనకల్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**
బోనకల్ మండల కేంద్రములోని రైతు వేదికనందు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆడపిల్లలు పుడితే భారం అనుకునే సంఘటనలు చూసి పేద కుటుంబంలో పుట్టిన ఆడపిల్లలు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో కాంగ్రెస్ హయాంలో బంగారు తల్లి పథకాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు.బంగారు తల్లి పథకంతో పేదింటి కుటుంబాల్లో వెలుగూ నింపినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు బడ్జెట్ నేడు బడ్జెట్ మూడూ లక్షల కోట్లకు పెరిగిందని కానీ కళ్యాణ లక్ష్మీ పథకానికి మాత్రం లక్ష నూట పదహార్లు మాత్రమేనని ఇస్తున్నారని అన్నారు.పెరిగిన బడ్జెట్ ప్రకారం పథకానికి ప్రభుత్వం నిధులు పెంచుకుంటే బాగుంటదని ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందనీ అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ కళ్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేయాలని కోరారు.ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన కులాల వారికి ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుకునే వాళ్ళలో తాను ముందుంటనని అన్నారు.అనంతరం ఆల్లపాడు ఆయకట్టుకు సాగర్ నీటి సమస్యపై ఎన్ఎస్పి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానికంగా ఉన్న రైతులు తమ ఆవేదనను భట్టి విక్రమార్కదృష్టికి తీసుకువెళ్ళారు.భట్టి విక్రమార్క అధికారులతో సమీక్ష నిర్వహించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నం చేయాలని తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడతాని తెలిపారు.రెగ్యులేటర్ లేకపోవడం వల్ల సమస్య తలెత్తుతుందని దానిని పరిష్కరించాలని రైతులు కోరారు.ఈ కార్యక్రమంలో టిపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యులు మోదుగు సుధీర్ బాబు,కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు,జిల్లా డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు,మధిర నియోజక వర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉమ్మినేని రమేష్,వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్,మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు నల్లమోతు సత్యనారాయణ,ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్ కుమార్,బీసీ సెల్ అధ్యక్షుడు కందుల పాపారావు,సర్పంచ్లు భాగంశ్రీనివాసరావు ,సుబ్బారావు,రవి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా భద్రు నాయక్,ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరికపల్లి భరోసా..



**కొణిజర్ల, ఫిబ్రవరి 20 (మనం న్యూస్ ):**
కొణిజర్ల మండలం,పెద్దమునగాలగ్రామానికి చెందిన గార్లపాటి వీరనాగులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు నాగులుని పరామర్శించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారు ఎవరికైనా అండగా వుంటామని వారికి వెంటనే మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తగిన వైద్య సాయం అందిస్తామని భరోసా ఇచ్చి,పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పూర్తి తో ముందుకు పోతామని, ప్రతీ వక్కరు పొంగులేటిని ఆదర్శంగా తీసుకొని పలు సేవాకార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో పొంగులేటి లాంటి ప్రజానాయకుడు దొరకడం ఖమ్మం జిల్లా ప్రజల అదృష్టమని జిల్లా ప్రజలందరూ పొంగులేటి వైపు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరీకపల్లి శ్రీను, మరికంటి ఎల్లయ్య,దేగల కిరణ్,గార్లపాటి బాబు, నరేష్ నవీన్,ఉన్నారు .

## మహ్మదాపురం 189 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను తొలగించి స్వాధీన పరుచుకోవాలని కలెక్టర్‌కు వినతి

**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20**



**(మనం న్యూస్) :** మండల పరిధిలోని మహమ్మదాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని 189 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టిన భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని మహమ్మదాపురం పరిధిలోని మాదిరిపురం బోడ తండా గ్రామాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ కు స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు చర్యలు తీసుకోవాలని సూచన చేసినట్లు సమాచారం ఈ సందర్భంగా మహమ్మదాపురం శివారు బోడ తండకు చెందిన బోడ రవి మాట్లాడుతూ 189 సర్వే నెంబర్లో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిలో పక్క జిల్లాలకు చెందిన వ్యాపారస్తులు భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అక్రమ నిర్మాణాలను చేపట్టి అమ్మిన స్థలాన్ని పదుల సంఖ్యలో వేరే వాళ్లకు అమ్ముతూ లక్షల రూపాయలు దండుకుంటు న్నారు ఒక పట్టా భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఎన్నో అనుమతులు ఉంటాయి కానీ ప్రభుత్వ భూమిని కేక్ ముక్కల్లాగా స్వాధీనం చేసుకొని అమ్మేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బోడ రవి పట్ల ప్రభాకర్ దామల్ల వీరయ్య జి నక కలమ్మ ఏతాకుల మధు జినక ఉప్పలి జినక మధు బోడ బీమా తదితరులు పాల్గొన్నారు.

# పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతు నీటి కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏంటి

**– రైతులకు కనీసం 50% నీళ్ళు కూడా పంటలకు ప్రభుత్వం అందించలేని స్థితిలో ఉంది**

**– సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం – సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క**

**బోనకల్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**

ఆళ్లపాడు కెనాల్ సాగర్ నీటి సమస్యను పరిశీలించేందుకు క్షేత్ర పర్యటన చేసిన మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతు పంటలన్నీ వేసి ఉన్నాయని నీటి సమస్య తలెత్తడంతో అవి ఎండిపోయే పరిస్థితి దాపురించిందని అన్నారు.రైతులు నీరు లేక ఎండిపోయిన తమ మొక్కజొన్న పంటను పరిశీలించేందుకు భట్టి విక్రమార్క ను పంట చేలకు తీసుకువెళ్ళారు .ఎండిపోతున్న మొక్కజొన్న కంకులను భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించడం జరిగింది. బోనకల్ బ్రాంచ్ కెనాల్ కు 800 క్యూసెక్కుల నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసినప్పుడు మాత్రమే వారబందిని పెట్టాలని కానీ రావాల్సిన నీటి కంటే తక్కువ స్థాయిలో కేవలం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ వారబంధి పెట్టడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వం ఆలోచన చేయాలని అన్నారు.ఈ ప్రభుత్వం పంటలకు 50 శాతం కూడా నీళ్లు అందించలేకపోతున్నారని అన్నారు.బోనకల్ బ్రాంచ్ కెనాల్ కు 800 క్యూసెక్కుల నీళ్లు రావాల్సి ఉండగా కేవలం 400 క్యూసెక్కుల నీళ్లు వచ్చినప్పుడు వారబంది పెట్టడం ఎందుకూ అన్నారు.పూర్తీ స్థాయిలో నీటి పంపిణీ జరగనప్పుడు వారమంది పెట్టడం సరైన పద్ధతి కాదని ఆ నీటి పంపిణీ మరికొన్ని రోజులు పెంచాలని అన్నారు. అలాగే బోనకల్ బ్రాంచ్ కెనాల్ ముందస్తుగానే ఈ మట్టి నీటిని



అడ్డుకునే ఏవైతే ఉన్నాయో వాటిని అధికారులు తొలగించే ప్రయత్నం చేస్తే నీటి సరఫరా అనేది పూర్తిస్థాయిలో జరుగుతుందని దీనిపై అధికారులు దృష్టి సారించాలని ఎక్కడెక్కడ రెగ్యులేటర్స్ అవసరం ఉన్నాయో వాటిని నిర్మించాలని అన్నారు.అనంతరం భట్టి విక్రమార్క పంటచేలో రైతులతో కలిసి భోజనం చేశారు.

# ఇల్లందు మున్సిపల్ పాలకవర్గంలో అలజడులను పరిష్కరించుకోండి

**– మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ల వివాదాలకు తెరదించండి**

**– ఇల్లందు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డేనియల్ డిమాండ్.**

**ఇల్లందు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**

ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లందు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్ మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీలో వర్గ విభేదాలతో రచ్చకెక్కినటువంటి వార్డ్ కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్ రావు లా మధ్య విభేదాల నేపథ్యంలో ఇల్లందు మున్సిపాలిటీ పాలనాపరమైన వ్యవస్థ కుంటు పడ్డది. అసమతిగా ఉన్న వార్డ్ కౌన్సిలర్లు చైర్మన్ తీరును వ్యతిరేకిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా కలెక్టర్ ఫిర్యాదును తిరస్కరించి వాళ్ల అడిగినా అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ ఏ విషయం తేల్చకుండా వారిని అక్కడ నుంచి పంపించడం అంటే కలెక్టర్ గులాబీ పార్టీ నాయకులకు సహకరిస్తున్నారా వార్డు మెంబర్లను కించపరిచారా అని వారు నిలదీశారు . వార్డ్ కౌన్సిలర్లు అందరూ కలెక్టర్ కి మొరపెట్టుకొని అయ్యా చైర్మన్ తీరు బాగోలేదు వార్డ్ కౌన్సిలర్లకు ఎవరికీ తెలియకుండా వార్డులల్లోకొచ్చి శంకుస్థాపనలు ఇతర కార్యక్రమాలు వార్డ్ కౌన్సిలర్ కు సంబంధం లేకుండా ఒంటెద్దు పోకడబోతున్నాడు అని వారి ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ వాట్ కౌన్సిలర్లను అసభ్యంగా మాట్లాడుతున్నాడు ద్వంద అద్దాలు వచ్చే రకంగా మాట్లాడుతున్నాడు మాకు న్యాయం చేయండి అని మొర పెట్టుకున్న స్పందించకపోవడం శోచనీయ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా 16 మంది వార్డ్ కౌన్సిలర్ల ఉన్నాము అని అంటే కలెక్టర్ లెక్కచేయకుండా తిరస్కరించినటువంటి పరిస్థితి నెలకొనడం శోచనీయమని నిందించారు. ఇల్లందు పట్టణంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు వాళ్ళ



బాధలను ఇబ్బందులు ఎవరికి తెలియ చేయాలో అర్థం కానటువంటి అయోమయ స్థితిలో ప్రజలు ఉన్నారు. అధికారులు ఇల్లందు ఎమ్మెల్యే జిల్లా మినిస్టర్లు జోక్యం చేసుకొని ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలంటే అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. లేని పక్షాన కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భద్రాచలం శాసనసభ్యులు పోదాం వీరయ్య జోక్యంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నాం. ఈ సమస్యని అతి త్వరగా పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డివూండ్. ఈ కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, పట్టణ ఉపాధ్యక్షులు ఐజాక్, పట్టణ ఎస్సీ సెల్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, మైనార్టీ నాయకులు మసూద్, పట్టణ బీసీ సెల్ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తారకరత్నకు నివాళులర్పించిన జల్లేపల్లి నందమూరి అభిమానులు

**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో నందమూరి తారకరత్న కు నందమూరి అభిమానులు సోమవారం నాడు ఘనంగా నివాళులర్పించారు. గుండెపోటుతో బెంగళూరులో చికిత్స పొందుతున్న నందమూరి తారకరత్న( 40) శనివారం నాడు తుది శ్వాస విడిచారు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, బాలకృష్ణ, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఆయన మృతదేహాన్ని బెంగళూరు నుంచి ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ కి తరలించిన విషయం తెలిసినదే. ఆయన అంత్యక్రియలు ఆదివారం నాడు హైదరాబాదులో నిర్వహించినారు. జల్లెపల్లి నందమూరి అభిమానులు అశ్రునయనాలతో ఆయన ఫోటోకు దండలు వేసి పూలు చల్లి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు గాదరి బాబు, పోట్ల జగదీష్, రమేష్,నాగేశ్వరరావు, మోహన్రావు, సాయికృష్ణ, వంశీ, రామకృష్ణ, మస్తాన్, వెంకన్న, సామేలు, శ్రీనివాస్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# షర్మిల అక్రమ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో



**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**

వైయస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అక్రమ అరెస్టు కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్కినేని సుదీర్ బాబు అన్నారు. షర్మిల అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు వాలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం బస్టాండ్ సెంటర్లో ఖమ్మం వరంగల్ హైవేపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్కినేని సుదీర్ బాబు మాట్లాడుతూ మహబూబాబాద్ లో జరిగిన వైఎస్ఆర్టీపీ బహిరంగ సభలో పార్టీ అధ్యక్షురాలు షర్మిల అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు, దందాలకు పాల్పడుతున్నారని విమర్శిస్తే అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో గాంధీ మార్గంలో పాదయాత్ర చేస్తున్న మహిళా నాయకురాలు షర్మిలను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని, ఇదే బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో నిరంకుశ పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, జగన్నాథ్ రెడ్డి, కార్యదర్శి కొత్త బాలాజీ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణోత్ రాంబాబు, పాల్ రాజ్ పాలేరు సేవాదళ్ అధ్యక్షుడు గుండా సందీప్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆలేటి రాములు, మండల నాయకులు పోలెపొంగు నరసింహారావు, బానోత్ సీతారాం నాయక్, మహిళ మండల అధ్యక్షురాలు వద్దిరాజు లక్ష్మి, ఎంపీటీసీ చీకటి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాత్ సే హాత్ జోడో యాత్రను అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలి

**– ప్రతి గడపగడపకు వెల్లి కాంగ్రెస్ భావజాలాన్ని,ఆలోచనలను, భారత్ జోడో సందేశాన్ని ప్రజలకు వివరించాలి.**

**– ఎన్ యస్ యు ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు జి మోహన్**

**– యూత్ కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ బత్తుల రమేష్**

**యూత్ కాంగ్రెస్ మండల నాయకులు నాగుల్ మీరా**



**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :**

తిరుమాలాయపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా తన వంతు సాయ శక్తుల కృషి చేస్తున్న తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్ మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి కాంగ్రెస్ పార్టీ జెండా గద్దే నిర్మాణం కోసం తన వంతు సహాయం చేస్తున్నారు అలాగే తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మరియు పిండిప్రోలు గ్రామంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు తన సొంత ఖర్చులతో పెయింటింగ్ చేపించారు ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను టిపిసిసి రేవంత్ రెడ్డి గారు చేస్తున్న హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని ప్రతి గ్రామల్లో గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ భావజాలాన్ని, ఆలోచనలను, భారత్ జోడోసందేశాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలి బీజేపీ బిఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్నట్లు వారు తెలిపారు .

# ప్రజా సమస్యలు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి....

## – జిల్లా కలెక్టర్ కె. శశాంక



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారించే విధంగా చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్(రెవెన్యూ), సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణిలో అనేక సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని గాంధీపురానికి చెందిన డొాగరి అంజయ్య తన భార్య అనారోగ్యంతో చనిపోవడంతో తన భార్య పేరున గల 235/1/ఎ/1/13/3లోని 1.23 ఎకరాల విస్తీర్ణం గల భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకోవడం జరిగిందని కానీ సాంకేతిక సమస్యల వలన రిజిస్ట్రేషన్ కావడం లేదని అట్టి స్లాట్ ను రద్దు రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం కల్పించాలని కోరారు.కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన భవానీ గడ్డ తండా నివాసానికి చెందిన గిరిజనులు తమ భూములు నాగారం బీట్ పరిధిలో గల 1125/1 సర్వే లో ఉన్నవని అట్టి భూమి సర్వే నెంబర్ రెండు జిల్లాల పరిధిలో ఉన్నదని, రెండు జిల్లాలో దరఖాస్తు సమర్పించుకున్నప్పటికి కంప్యూటర్ లో తప్పుడు ధ్రువపత్రాలు అని తిరస్కరించ బడుతున్నదని, బ్రతుకు దెరువుకు ఆధారొాగా ఉన్న తమ భూమిని సరిచేసి మా భూములకు హక్కు పత్రాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.గార్ల మండలం పుల్లూరు గ్రామ పంచాయతీ పీక్లా తండాకు చెందిన భూక్యా రేణుక తన భర్త ఇండో టిబెటాన్ బోర్డర్ ఫోర్స్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తు ప్రమాదవశాత్తు మరణించడం జరిగినదని, మాది కులాంతర వివాహం ముగ్గురు పిల్లలు, వృద్ధులైన అత్తమామలు ఉన్నారని వారిని పోషించుకునేందుకు సైనిక అమరవీరుల కుటుంబాలను ఆదుకునే ప్రక్రియలో భాగంగా తన విద్యార్హతలకు తగిన ఉద్యోగము, వ్యవసాయ భూమిని,గార్ల మండలంలో ప్రభుత్వ నివేశన స్థలం కేటాయించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కురవి మండలానికి చెందిన ఎడబోయిన రమణ మండలంలోని చెరువు నుండి వచ్చే కాలువ నీటిని ఇతర వ్యక్తులు అక్రమంగా మోటర్ల ద్వారా మరొక బావికి తరలిస్తున్నారని తమ భూములకు నీరు అందక నష్టం జరిగి పంటలు ఎండుతున్నాయని, ప్రశ్నించిన మా పై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ముదురుకోళ్ల జ్యోతి గత కొన్నిసంవత్స రాలుగా బ్రతుకు దెరువుకు పూసల భేరం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని బిసి కార్పొరేషన్ ద్వారా లోన్ మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.గ్రీవిన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షల ప్రత్యేక అవగాహన తరగతులు పదవ తరగతి ఉన్న ప్రతీ పాఠశాలలు ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు నిర్వహించాలని అందుకు రాష్ట్ర విద్యా శాఖ ఒక్కో విద్యార్థికి ఒక్క రోజుకు 15 రూపాయలను స్నాక్స్ కొరకు కేటాయిస్తుందని అది అమలు జరిగే విధంగా చూసుకోవాలని అన్నారు. ఆదేవిదంగా ప్రత్యేక అధికారులు హరితహారం మండలాల,గ్రామాల వారీగా హరితహారం మొక్కలపై, నర్సరీలపై, జిల్లాలోని హాస్టళ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన ( 89 ) దరఖాస్తులను పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## అంగన్‌వాడీ సెంటర్‌కు తూకం యంత్రం బహూకరించిన కౌన్సిలర్

**తొర్రూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** తొర్రూరు పట్టణ పరిధిలోని 15వ వార్డ్ రెండవ అంగన్వాడి సెంటర్ కు . వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి తో కలిసి స్థానిక వార్డు కౌన్సిలర్ కోల్పుల శంకర్ తండ్రి గారి పేరు మీద తూకం యంత్రం బహూకరిచడం జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లను గర్భిణులు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కౌన్సిలర్ కొలుపుల శంకర్. వారి తండ్రి గారి పేరు మీద అంగన్వాడి సెంటర్ కు వేయింగ్ మిషన్ బహూకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో అవకతవకలను నిరోధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో వేయింగ్ మిషన్ ఉండడం ద్వారా అంగన్వాడి కేంద్రాల్లో స్టాక్ ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు అన్నారు. 15జి వార్డ్ కౌన్సిలర్ శంకర్ కి తూకం యంత్రం అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు. కౌన్సిలర్ గజానంద్. అంగన్వాడీ టీచర్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సొమ్ము కేంద్రానిది–సోకు రాష్ట్రానిది : బిజెపి



**తొర్రూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** ప్రజా గోస-బీజేపి భరోసా యాత్ర లో బాగంగా తొర్రూర్ లో స్థానిక భగత్ నగర్ లో బిజెపి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇంఛార్జి పరుపాటి రాం మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రతీ సంక్షేమ పథకం లో కేంద్ర ప్రభుత్వం వాటా సింహ భాగం ఉందని కానీ కేసిఆర్ కుటుంబం మాత్రం కేంద్ర ప్రభుత్వం పై నిందలు వేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారు అని సొమ్ము కేంద్రానిది-సోకు రాష్ట్రానిది అని ఆరోపించారు.ప్రదాని నరేంద్ర మోడీ తెలంగాణా సమగ్రాభివృద్ధి కోసం అధిక శాతం నిధులు మంజూరు చేస్తూ ఎలాంటి వివక్ష లేకుండా టీమిండియా స్ఫూర్తి తో చిత్త శుద్ధి తో తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో నియంతృత్వ పాలన, అహంకార పాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో పేదల ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. .కేసిఆర్ సర్కారు అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో లిక్కర్ మాఫియా, డ్రగ్స్ మాఫియా, సాండ్ మాఫియా రాజ్యమేలుతోంది అని, కేసీఆర్ నిరంకుశ పాలన త్వరలో అంతం కావడం ఖాయమని, కేసీఆర్ గడీల కోటలు బద్దలు కొట్టి కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీగా ఉన్న తెలంగాణ తల్లికి బీజేపీ నేతృత్వంలో విముక్తి కాబోతుంది అని ఆదిశగా పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది అని, రాష్ట్ర వ్యాప్తంగా 11వేల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య, పాకనాటి ధామోధర్ రెడ్డి, తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా నాయకులు పూసాల శ్రీమాన్,గంధం రాజు, మంగళపల్లి యాకయ్య,నూకల నవీన్, శివ, సుబ్రహ్మణ్యం, బూతం నర్సింహులు ,పేర్ల వెంకన్న పేర్ల తిరుపతి, గంధం వీరయ్య, పవన్ ,వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# మనం మహబూబాబాద్

## మహిళా కానిస్టేబుల్ రాధికను అభినంచిన ఎస్పీ



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** మహిళా ప్రాణాలు కాపాడిన మహిళా కానిస్టేబుల్ రాధికను సోమవారం నాడు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డును అందించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున కురవి వీరభద్రస్వామి కళ్యాణం జరిగే మండపంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బానోత్ నిర్మల అనే మహిళ ప్రమాదవశాత్తు విద్యుత్ షాకు గురై ఆపస్మారక స్థితిలోకి వెళ్లగా అక్కడే విధులు నిర్వహిస్తున్న గూడూరు స్టేషన్ మహిళ కానిస్టేబుల్ రాధిక (జి.నెం 2060) సమయస్ఫూర్తితో వ్యవహరించి సీపీఆర్ (గుండె కొట్టుకునేలా చేసే ప్రక్రియ) చేసి నోటి ద్వారా శ్వాస అందించి ప్రాణాలను కాపాడింది. ప్రథమ చికిత్స చేసి భక్తురాలిని రక్షించిన మహిళా కానిస్టేబుల్ కానిస్టేబుల్ రాధికను ఎస్సీ శరత్ చంద్ర పవార్ జిల్లా పోలీస్ కార్యాలయంలో క్యాష్ రివార్డ్ ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ ఇంచార్జీ డిఎస్పి రమణబాబు మహబూబాబాద్ రూరల్ సిఐ రవికుమార్, కురవి ఎస్ఐ రాము పాల్గొన్నారు.

## విద్యాసంస్థలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాలి : పిడిఎస్‌యు




**గార్ల, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** కంటి చూపు సమస్యలతో ఎవరికి చెప్పలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం చొరవ తీసుకొని కంటి పరీక్షలు అన్ని విద్యాసంస్థలలో నిర్వహించాలని పి.డి.ఎస్.యు గార్ల మండల ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారంనాడు గార్ల మండల కేంద్రంలో పి.డి.ఎస్.యు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్) ద్వారా గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు సాధారణ కంటి పరీక్షలు చేసే ప్రభుత్వం ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో కంటివెలుగు శిబిరాలకు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులను అనుమతించక పోవడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.. కంటి వెలుగు కార్యక్రమాన్ని విద్యాసంస్థల్లో అనుమతిస్తే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుంది పేర్కొన్నారు. పాఠశాల, ఇంటర్ కళాశాలల్లో బ్లాక్ బోర్డుపై అక్షరాలు కనిపించని బాలబాలికలు ఒక్కో క్లాస్ రూముకు 10–20 మంది చొప్పున ఉంటున్నారని అన్నారు. పాఠశాల స్థాయిలో గతంలోనే 4,900 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, కొవిడ్ తరువాత ఈ సంఖ్య మరింత పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నా ప్రభుత్వం ఆ వైపు అడుగులు వేయడం లేదని ఆరోపించారు. అధికారికంగా విద్యార్థులందరికీ పరీక్షలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పి.డిఎస్.యు మండల నాయకులు సతీష్, వినయ్, సతీష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం



**పెద్దవంగర, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** పెద్దవంగర కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం రోజున ఫేర్వెల్ పార్టీ నిర్వహించడం జరిగింది, ఈ వీడ్కోలు సమావేశాన్ని ఉద్దేశించి కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గంగారపు స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో పై చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు, విద్యార్థులందరూ ఇన్నేళ్లుగా చదువుకున్న పాఠశాలను వదిలేసి వెళ్లడం ఎంతో బాధగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 7.50 లక్షల గంజాయి పట్టివేత

**– ఐదుగురు నిందితుల అరెస్టు, పరారీలో నలుగురు**
**– 50 కిలోల ఎండు గాంజా, రెండు కార్లు, ఓ ట్రాలీ స్వాధీనం**
**– మరిపెడలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘు**



**మరిపెడ, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** నిషేధిత గంజాయిని ట్రాలీలో ప్రత్యేక క్యాబిన్లు రూపొందించి గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు యత్నించిన ముఠాను మహబూబాబాద్ జిల్లా మరిపెడ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మరిపెడ పీఎస్లో కేసుకు సంబందించిన వివరాలను తొర్రుర్ డిఎస్పీ ఏ రఘు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మరిపెడ సీఐ సాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది మరిపెడ బంగ్లాలోని ఓ కళాశాల సమీపంలో కారు నుంచి ఓ ట్రాలీలోకి మారుస్తుండగా పట్టకున్నారు. అనంతరం వాహనాల్లో తనిఖీ చేయగా సుమారు 50కిలోల ఎండు గంజాయి రవాణ చేస్తున్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.7.5లక్షలు ఉంటుందని,ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్టం విశాఖపట్నం జిల్లా నుంచి మహారాష్టకు తరలిస్తున్నారన్నారు. ఈ కేసులో ట్రాలీ, రెండు కార్లు స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా ఘటనా స్థలి నుంచి ఇద్దరు పరారు అయ్యారు. ఈ 50కిలోల గంజాయిని పాత నేరస్తుడు మరిపెడ మండల కేంద్రానికి చెందిన గంధసిరి నాగరాజు తనకు గతంలో పరిచయం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్టం విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం, రత్తంపేట్కు చెందిన శ్రీనివాస్ నుంచి కొనుగోలు చేశాడు. అనంతరం ఈ నెల 19వ తేదీన భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన చలమల్ల కంట్లమయ్య, నల్లగొండ జిల్లా మోత్కూరుకు చెందిన నరేష్లను కారు తీసుకుని వెళ్లాల్సిందిగా నాగరాజు ఆదేశించగా వారు గంజాయి కోసం వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని అన్నవరం సమీపంలోని కత్తిపూడి గ్రామం వద్ద శ్రీనివాస్ని కలిసి గంజాయిని కారులో వేసుకున్నారు. అనంతరం మార్గమధ్యంలోకి వచ్చాకా.. అంగడి రవి, డ్రైవర్ కొండ తేజ్కుమార్లు గంజాయి రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన ట్రాలీలోకి సదరు గంజాయిని మార్చటం జరిగింది. అక్కడి నుంచి కారు, ట్రాలీ మరిపెడకు చేరుకోగా, అక్కడ ప్రధాన నిందితుడు గంధసిరి నాగరాజు గంజాయిని కొనుక్కోవటానికి వచ్చిన వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా బర్సీ కి చెందిన రామకృష్ణ మాధవరావు పాట్ దార్, పాండురంగ్ సోమనాథ్ సోన్వనిలతో సిద్దంగా ఉన్నాడు. అంతా కలిసి గంజాయిని వ్యాపారుల కారులోకి మారుస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకోవటం జరిగింది. మొత్తం ఈ కేసులో 9మంది ఉండగా 5గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని, మిగతా నలుగురిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడైన గంధసిరి నాగరాజుపై గతంలో 8కేసులుండగా కొద్ది కాలం క్రితమే జైలు నుంచి బయటకు వచ్చాడని ప్రస్తుతం హైదరాబాద్లో నివాసముంటు ఈ దందాలు కొనసాగిస్తున్నాడన్నారు. ఇతడిపై రెండు సార్లు పీడీయాక్ట్ ప్రయోగించినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. నిషేధిత గంజాయి రవాణాకు చెక్ పెట్టిన సీఐ సాగర్, ఎస్ఐలు దూలం పవన్ కుమార్, ఝాన్సి, సంతోష్, సిబ్బంది సురేష్, సందీప్లను డీఎస్పీ అభినందించారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**– ప్రజా సమస్యలపై సాగిన చర్చ**
**– మండల అభివృద్ధికి సహకరించాలి : ఎంపీపీ అంజయ్య**




**తొర్రూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి గ్రామీణా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మొదలగు అంశాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదా సీదాగా సాగింది. సోమవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో సింగారపు కుమార్,పలు శాఖల అధికారులు పాల్గొన్న సభలో ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నలు లేవనెత్తగా సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో ఎస్సీ ఎస్టీ గిరిజనుల నిరుపేదల భూములకు పట్టాలు లేకపోవడంతో వారు రైతుబంధు, రైతు బీమా, పిఎం కిసాన్ లాంటి పథకాలకు దూరమవుతున్నారని అన్నారు అలాగే వెలికట్ట, మాటేడు, మడిపల్లి, ఫతేపురం తదితర గ్రామాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్రభుత్వ పన్ను ఎగవేస్తూ ఒక గుంట రెండు గుంటలు రిజిస్ట్రేషన్ చేస్తూ నాలా పన్ను కట్టకుండా రైతుబంధు లాంటి పథకాలకు లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. వెంచర్లలో గ్రీన్ ల్యాండ్ తీయకుండా, తీసిన వాటిని మళ్లీ అమ్ముకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని వీటి పై రెవిన్యూ అధికారులు దృష్టి సారించాలని కోరారు. అమ్మాపురం ఎంపిటీసీ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో రైతులు వరి పంటలకు చీడలు వచ్చి ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయ అధికారులు సూచనలు సలహాలు ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయాల్లోనే సేదతీరుతూ రైతులను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎందుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, విద్యుత్, తాగునీటి సమస్యలపై, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మొదలగు అంశాలపై ప్రజా ప్రతినిధులు మాట్లాడారు.ప్రజా సమస్యలపై తాము ఎన్నిసార్లు ప్రశ్నించినా అధికారులు సమాధానమే చెబుతున్నారే తప్ప పరిష్కారం చూపడం లేదని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు.గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, మొక్కుబడి గా విధులు నిర్వహిస్తే ఉపేక్షించబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని శాఖలకు సంబంధించి చర్చలు, సమస్యల పరిష్కారంపై అంతంతమాత్రంగానే చర్చలు సాగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయ పరుచుకుంటూ అభివృద్ధి పనుల్లో ముందుకు సాగాలని, మండల అభివృద్ధి కి అందరూ సహకారం అందించాలని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య కోరారు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు, అభివృద్ధిలో కీలకంగా నిలిచే అధికారులు సభకు తప్పకుండా హాజరుకావాలని, ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీపీ కోరారు, కార్యక్రమంలో తహసిల్దార్ నాగేంద్రప్రసాద్, వ్యవసాయ రంగంపై ఏఓ కుమార్ యాదవ్, డాక్టర్ మీరాజ్, వెటర్నరీ డాక్టర్ వెంకన్న, ఎంపీ ఓ గౌస్, ఉపాధి హామీ పనులపై ఏపీఓ పార్థసారధి పలు అంశాలపై పలు విభాగాల ప్రతినిధులు మాట్లాడారు.

# ప్రజల రక్షణకే పోలీసు వ్యవస్థ

**– ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** ప్రజల రక్షణ కోసమే అనునిత్యం పోలీసు వ్యవస్థ ఉన్నదని, బాధితులకు భరోసాగా నిలబడిన వారికి న్యాయం చేయడమే పోలీసుల కర్తవ్యమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సోమవారంనాడు మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంభందిత అధికారులకు సూచించారు. ప్రతి రోజు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని బాధితులు నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఉదయం 11:00 గం.ల నుండి మద్యాహ్నం 2గం.ల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలిపారు.ప్రజల రక్షణ కోసమే అనునిత్యం పోలీసులు పనిచేస్తున్నారని, సమస్యలు పరిష్కరించడంలో పోలీసులు ముందుండి, ప్రజలకు న్యాయం జరిగేలా చూడటమే పోలీసుల కర్తవ్యం అని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి పనిచేయాలని, బాధితుల ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

# కొత్త ఇండ్ల నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్

**– మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్**



**తొర్రూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)** : కొత్త ఇండ్ల నిర్మాణాల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న మనీ మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్ అన్నారు. సోమవారం తొర్రూర్ లో ఉన్న కొత్తగా నిర్మిస్తున్న 16 వార్డులలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. సేటెబ్యాక్ లేకుండా నిర్మిస్తున్న ఇండ్లకునోటీస్ జారీ చేస్తామన్నారు. నోటీస్ ముట్టిన త్రీ డేస్ లో సెట్ బ్యాక్ కాకపోతే మున్సిపల్ సిబ్బంది చే తొలగించి దానికి అగు కర్చులు వారి నుండి వసూలు చేస్తామన్నారు. మీకు ఏమైనా ఇబ్బంద్ది ఉంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించగలరని అన్నారు. ఆన్లైన్లో పర్మిషన్ తీసుకున్న తర్వాతనే నిర్మాణం చేపట్టాలని. ఫ్రంట్ సైడ్ 1.5 మీటర్స్ సెట్ బ్యాక్. చుట్టూ కూడా వన్ మీటర్ వదిలిపెట్టి నిర్మాణం చేసుకోవాలన్నారు.సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను ప్రతి ఒక్కరూ నిషేధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ ఏఈ రంజిత్. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సునీల్. రంజిత్. హెల్త్ అసిస్టెంట్ రాజు. వార్డ్ ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ షర్మిల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మహబూబాబాద్ జర్నలిస్టులు



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** ఇంటి స్థలాల కోసం మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ జర్నలిస్ట్ ల వద్ద డబ్బులు వసూలు చేసారనడం, ఎమ్మెల్యే జర్నలిస్ట్ లను మోసం చేసారంటూ వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు శుద్ద అబద్దమని దానిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తేల్చిచెప్పిన జర్నలిస్ట్ లు.సోమవారంనాడు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జర్నలిస్టులు మాట్లాడుతూ ఇలాంటి అవాస్తవ ఆరోణలు జర్నలిస్ట్ ల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు షర్మిల ఉపసంహరించుకోవాలని సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మంచిమనుసుతో 99మంది జర్నలిస్ట్ లకు ఇంటిస్థలాలు అందజేసే ప్రయత్నంలో ఉన్నారని ఇందుకోసం కొందరు జర్నలిస్ట్ లతో కమిటీ వేసి వారి ద్వారా కార్యక్రమం కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. మీ రాజకీయాల లబ్ది కోసం జర్నలిస్ట్ ల అంశాన్ని వాడుకోవద్దని, జర్నలిస్ట్ ల ప్రయోజనాలకు భంగం కలిగేవిధంగా ప్రవర్తించరాదని వైఎస్ షర్మిలకు సూచించారు.ఈ సమావేశంలో మహబూబాబాద్ జర్నలిస్టు పాల్గొన్నారు.

# మహిళ కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**గార్ల, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** వివాహిత మహిళ కనపడటం లేదని గార్ల పోలీసు స్టేషన్ లో సోమవారంనాడు పిర్యాదు వచ్చినట్లు ఎస్ఐ వెంకన్న తెలియజేశారు. ఎస్ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం కొత్త పోచారం గ్రామానికి చెందిన పొన్నెకంటి వెంకటలక్ష్మి గత రెండు రోజుల నుండి కనబడుటలేదని అతని భర్త పొన్నెకంటి రామకృష్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు అన్నారు.

# బిజెపిని నిలవరించడమే కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం

**– బిఆర్ఎస్‌తో సీట్ల సర్దుబాటు ఆరోపణలు అవాస్తవం**

**– సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య**




**గార్ల, ఫిబ్రవరి 20 (మనం న్యూస్):** కార్మిక చట్టాలను సవరిస్తూ మతోన్మాద, ఫాసిస్టు విధానాలను అవలంబిస్తూ దళితులు, క్రైస్తవులు, ముస్లిం పై దాడులు చేస్తున్న బిజెపి పార్టీని అటు కేంద్రం లో ఇటు రాష్ట్రంలో నిలవరించడమే కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. స్దానిక మంగపతిరావు భవనంలో సోమవారం బొబ్బా ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పధకాన్ని నీరుగార్చేందుకు బడ్జెట్ లో నిధులలో కొత విధించారని మండిపడ్డారు.ఆహార సబ్సిడీని ఎత్తివేయడం తో దేశంలో ఆకలి కొరత ఏర్పడుతుందని,ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడి నిరుద్యోగ కొరత పెరుగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. కార్మిక హక్కుల ను కాల రాస్తూ 24 కోడ్ లను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను తీసుక వచ్చినా ప్రధాని మోడి ప్రభుత్వ రంగ సంస్దల ను కారు చౌకగా అమ్మేస్తూ ఎయిర్లైన్స్ ను ప్రయివేట్ పరం చేస్తున్నారని అందోళన వ్యక్తం చేశారు.కేంద్రం లో బిజెపి అధికారంలోకి వచ్చాక అంబానీతో పాటు కార్పొరేట్ శక్తుల సంపద మూడింతల రెట్టింపు అయిందని ,పౌరహక్కులు హరించబడి ప్రజాస్వామ్య వాదులపై దాడులు పెరిగాయని అందోళన వెలిబుచ్చారు.దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం అయిందని వివిధ రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో అ పార్టీ డిలా పడటమే అందుకు ఉదాహరణ అన్నారు. రాష్ట్రంలో సియం కేసీఆర్ బిఆర్ ఎస్ పార్టీ తరపున ఎన్ని సీట్లు గెలుస్తాడో తెలియదు కానీ దేశాన్ని పాలిస్తాను అనడం హస్య స్పదంగా ఉందని చెప్పారు. పరిమితం గా డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళిత బంధు పథకాలను కేటాయించి బిఆర్ ఎస్ కార్యకర్తలకే అందిస్తున్నారని విమర్శించారు. బిజెపి, కాంగ్రెస్ లు బిఆర్ ఎస్ కు ప్రత్యామ్నాయంగా చెప్పుకుంటున్నాయని దేశంలోను,రాష్ట్రంలో ను బిజెపి ని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రజా పునాదిని నిర్మించు కోవడమే సిపిఎం తక్షణ కర్తవ్యం అన్నారు. క్షేత్ర స్దాయిలో పార్టీని బలోపేతం చేయడానికి స్దానిక పోరాటాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా,మండల కార్యదర్శులు సాధుల శ్రీనివాస్,కందునూరి శ్రీనివాస్, జిల్లా, మండల కమిటీ సభ్యులు కందునూరి కవితా, భూక్య హరి, జి.రాజారావు, కె.ఈశ్వర్ లింగం,వి.వెంకటేశ్వర్లు, ఐ.గోవింద్,సిహెచ్. ఎల్లయ్య, ఎ.సత్యవతి, యం.నాగమణి, బి.లోకేశ్వరావు,సిహెచ్. మౌనిక, టి.రమా,మౌలానా, బాబు, శ్రీను,కై బాబు,రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# బెదిరింపులు...బేరాలు వార్త నిరాధారం

**పత్రికా కరెస్పాండెంట్‌కు లీగల్ నోటీసులు : హైకోర్టు అడ్వకేట్ పివి కృష్ణయ్య**

**ఖమ్మం, ఫిబ్రవరి 20(మనం న్యూస్) :** 'బెదిరింపులు.. బేరాలు' అనే వార్తకు సంబంధించి హైకోర్టు అడ్వకేట్ పి.వి.కృష్ణయ్య తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఇంటర్ విద్యా ఫోరం), తెలంగాణ ప్రభుత్వ కళాశాలల ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ల తరపున ఆంధ్రజ్యోతి పత్రిక ఖమ్మం జిల్లా కరస్పాండెంట్ కు లీగల్ నోటీస్ జారీ చేశారు. సదరు వార్తకు సంబంధించిన సమాచారం మూలాన్ని నోటీస్ అందిన మూడు రోజుల్లోగా తెలియజేయాలని, లేని పక్షంలో చట్టబద్ధమైన చర్యలకు ఉపక్రమించవలసి ఉంటుందని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాక్టికల్ పరీక్షల ఇన్విజిలేటర్లు పరీక్షను సరిగా నిర్వహించని పక్షంలో ఆ విషయాన్ని తగు చర్య తీసుకోగల సంబంధిత జిల్లా ఉన్నతాధికారికి తెలియజేయకుండా తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతి కరస్పాండెంట్ కు మాత్రమే ఎలా ఫిర్యాదు చేస్తారని ఆ నోటీసులో ప్రశ్నించారు. ఇంటర్ పరీక్ష విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ల పై ఎలాంటి ఆధారాలు లేకుండాను, సమాచార మూలాలను తెలపకుండాను ఆరోపణలు చేయడం.. ఇష్టానుసారంగా వార్తలు ప్రచురించడం కొందరు పత్రికా కరెస్పాండెంట్ లకు పరిపాటిగా మారిందని, అందరికీ విదితమే గాక ఇదంతా ఎంతమాత్రమూ అతిశయోక్తి కూడా కాదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 19వ నిబంధన ప్రకారం లభించిన పత్రికా స్వేచ్ఛను ఉపయోగించి కొందరు కరస్పాండెంట్లు సమాజంలో పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తులను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నారనేది ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తామెదుర్కొంటున్న బెదిరింపులు.. వత్తిళ్ల గురించి ఇన్విజిలేటర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసిన సందర్భంలో సదరు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను సందర్శించి, సమస్య నివారణ చేయగల స్క్వాడ్లు, ప్రత్యేక అధికారులను నియమించడమనేది అనేది అత్యంత గోపనీయమైన అంశమని, ఆ విషయం ఆంధ్రజ్యోతి కరస్పాండెంట్ కి మాత్రమే తెలియరావడం అత్యంత విస్మయం కలిగించే విషయమని పేర్కొనానరు. ఒకవేళ జిల్లా అధికారులే సదరు గోపనీయతను బహిర్గతం చేసినట్లయితే వారు ప్రవర్తనా నియమావళి దృష్ట్యా, అందుకు తగిన అత్యంత క్రమశిక్షణ చర్యకు గురి అవుతారని తెలిపారు. కాగా ఖమ్మంలోని ఆంధ్రజ్యోతి దినపత్రిక కరస్పాండెంట్ సదరు గోపనీయ వార్తను ఎలా ప్రచురించారో తెలియడం లేదని, దీన్నిబట్టి ఆ వార్తకు సంబంధించిన సమాచారం మూలాన్ని కరస్పాండెంట్ వెల్లడించాల్సి ఉంటుందని, లేదా నిరాధార సమాచారంతో వార్తను ప్రచురించారని అంగీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని నిబంధన 21 ప్రకారం ప్రతి వ్యక్తి జీవించే హక్కును, అది కూడా కీర్తిని పొంది ప్రతిష్టతో జీవించగలిగే హక్కును కలిగి ఉన్నాడని, ఈ మధ్యనే కిరణ్ బేడీ వర్సెస్ ఢిల్లీ పోలీస్ కమిషనర్ కేసులో సైతం వ్యక్తి కీర్తికి, ప్రతిష్టతో జీవించే హక్కుకు భంగం కలిగించే విషయాలను ప్రచురించిన సంబంధిత వార్తాపత్రికలు, కరస్పాండెంట్ లపై క్రిమినల్, పరువు నష్టం కేసుల ద్వారా నష్టపరిహారం పొందవచ్చుననీ, పత్రికలపై చర్యలు తీసుకోబడతాయనీ గౌరవ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని కృష్ణయ్య ఉద్ఘాటించారు. ప్రత్యేకించి ఇన్విజిలేటర్ పేరు గాని అధికారి పేరు గాని కనీసం మేనేజ్మెంట్ పేరు గాని ప్రస్తావించకుండానే జూనియర్ లెక్చరర్ల ప్రతిష్టకు పరోక్షంగా భంగం కలిగించే విధంగా సదరు వార్తను కరస్పాండెంట్ ప్రచురణ చేశారని, అదికూడా ప్రస్తుత పరీక్షల కోసం నియమించబడిన లెక్చరర్లకే కాక, మునుపటి సంవత్సరాలలో పనిచేసిన వారికి సైతం ఈ ప్రతిష్ట భంగం కలిగేటట్లు వార్త ప్రచురించారని, తన క్లైంట్స్ కి చెందిన అసోసియేషన్ లే కాక వివిధ అసోసియేషన్ల సభ్యులకు, వాటి నాయకులకు సైతం ఈ విధమైన నిరాధార పూరిత, సరైన సమాచారమూలం లేని వార్త ప్రచురణతో ప్రతిష్ట భంగం కలిగిందని తెలిపారు. సదరు వార్త పత్రిక కరస్పాండెంట్ ఇలా ప్రతిష్ట భంగం కలిగించడంలో తమ స్వప్రయోజనాలు.. ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చుకునే బ్లాక్మెయిలింగ్ చర్యలే ఇవి కాబోలునని కృష్ణయ్య వ్యాఖ్యానించారు. ఇంతేగాక ఇంటర్మీడియట్ ఫలితాలను బోర్డు వెల్లడించక ముందే విద్యార్థులు ఫెయిల్ అయ్యారనీ.. ఇన్విజిలేటర్లు విద్యార్థుల భవిష్యత్తుతో, జీవితాలతో ఆడుకున్నారని ఈ కరస్పాండెంట్ వార్తలు రాస్తున్నారంటే అతడి బ్లాక్మెయిలింగ్ ధోరణి ప్రస్ఫుటమవుతున్నదని తెలిపారు. పూర్తి స్థాయి న్యాయబద్ధమైన సమాచారం లభించినపుడే, దానిలో కొంత వాస్తవం ఉన్నదని రూఢి అయిన తర్వాతే, ఎవరి పైనైనా ఆరోపణలు వచ్చినపుడు వారి వివరణ కూడా తీసుకున్న తరువాత మాత్రమే వార్త ప్రచురణ జరగాలని, అంతేకానీ ఏ వివరణగానీ, స్పష్టీకరణగానీ తీసుకోకుండానే.. నిరాధార సమాచారంతోనే వ్యక్తుల కీర్తి ప్రతిష్టలతో జీవించే హక్కుకు భంగం కలిగించేలా పత్రికలు వార్తలు ప్రచురించ రాదని కృష్ణయ్య అన్నారు. పైన పేర్కొన్న వాస్తవాలు, పరిస్థితుల దృష్ట్యా సంబంధిత వార్త ప్రచురణ చేసిన కరస్పాండెంట్ కు, పత్రిక మొత్తానికి తనకు తానుగా ప్రత్యామ్నాయ ప్రతినిధి అయిన చీఫ్ ఎడిటర్ కు లీగల్ నోటీసు జారీ చేస్తూ, సమాచార మూలాన్ని నిర్ణీత గడువులో తెలపాలని, లేని పక్షంలో, వారి పైన పైన సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు ఫైల్ చేయడమే కాక, చట్ట ప్రకారం అందుబాటులోని వివిధ చట్ట పరిష్కారాలను పొందాలని తన క్లైంట్లు నిర్ణయం తీసుకున్నారని కృష్ణయ్య తన లీగల్ నోటీసులో పేర్కొన్నారు.

# సునీల్ నాయక్ కుటుంబాన్ని ఆదుకునే బాద్యత మేమే తీసుకుంటాం

**– మంత్రులు కేటీఆర్, హరీష్ రావు లేఖలు ఇచ్చారు..**

**– విమర్శలు చేసేవారు.. ఆరోపణలు చేయడం తప్ప ఆదుకోలేరు.....: ఎమ్మెల్యే శంకర్ నాయక్**



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):** సునిల్ నాయక్ కుటుంబాన్ని ఆదుకునే బాద్యత తామే తీసుకుంటామని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారంనాడు కలెక్టర్ శశాంకను ప్రత్యేకంగా కలిసి సునీల్ నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కోరారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన సునీల్ నాయక్ అనే విద్యార్థి ఆత్మహత్య చెసుకున్నాడు.. వారి కుటుంబాన్ని ఆదుకునే బాద్యత తీసుకుంటామని హామీ ఇచ్చాం ఖచ్చితంగా ఆచరణలో చూపుతామని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు.సునీల్ నాయక్ కుటుంబంలో ఆయన సోదరుడు శ్రీనివాస్ నాయక్ కు ఉద్యోగం కల్పించడం, డబుల్ బెడ్ రూం ఇల్లు, ఆర్థికసహాయం అందించడంలో సహకరించాలని ఎమ్మెల్యే శంకర్ నాయక్ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు లేఖలు అందించారు. వారు స్పందించి జిల్లా కలెక్టర్ కు పరిశీలన, చర్యలకోసం లేఖలు పంపారని అన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ స్వయంగా సునీల్ నాయక్ తండ్రిని, సోదరుని వెంట తీసుకొని కలెక్టర్ శశాంకను కలిసి లేఖను అందజేశారు.సునీల్ నాయక్ కుటుంబాన్ని మానవతాదృక్పదంతో ఆదుకోవాలని కలెక్టర్ శశాంకను కోరారు.. కలెక్టర్ శశాంక సానుకూలంగా స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారని ఎమ్మెల్యే శంకర్ నాయక్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రతివిషయాన్ని రాజకీయం చేసేవారు.. అవాస్తవ ఆరోపణలు చేస్తూనే ఉంటారని.. ప్రజల దీవెనలతో ప్రభుత్వంలో ఉన్న మేము ప్రజాసంక్షేమాన్ని బాద్యతగా బావించి పనిచేస్తామన్నారు. తమ..కుటుంబం పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే శంకర్ నాయక్ కు సునీల్ నాయక్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

# మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యం : సిఐ సత్యనారాయణ




**పెద్దవంగర, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** మానవుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయని తొర్రూర్ సీఐ సత్యనారాయణ అన్నారు, సోమవారం రోజున మండలంలోని చిట్యాల గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందించారు, మొదటి బహుమతిగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి టీం విజేతగా నిలవగా వీరికి తొర్రూర్ సిఐ సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు, ద్వితీయ బహుమతి పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన టీం విజేతగా నిలిచి పెద్దవంగర స్థానిక ఎస్సు రియాజ్ పాషా చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు, ఈ సందర్భంగా సిఐ,ఎస్ఐ లు మాట్లాడుతూ యువతకు క్రీడలు ఎంతో మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని విజేతలుగా నిలవాలని కోరుకున్నారు, ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వహణ కర్త దేశెట్టి వెంకటేష్, దాత దేశెట్టి వెంకటనారాయణ, క్రికెట్ కిట్టు దాత తండా సాయి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దాత ఈదురు గోపాల్, నిర్వాహకులు నారబోయిన రాము, చరణ్, గుంటుక హరీష్, పాలవెల్లి సోమేశ్వర్ ,ఎండి దిలీప్ ,పాలవెల్లి నరేష్, ఎండి రియాజ్, పిట్టల తరుణ్, కుమార్ ,సతీష్ ,రాకేష్ ,అక్బర్ శ్రీనివాస్, అరుణ్ ,మాలిక్ ,సుమంత్, నాగరాజు పాల్గొన్నారు.

# యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ డోర్నకల్ నియోజకవర్గ హడక్ కమిటీ నియామకం

**నియోకవర్గ కన్వీనర్ గా పర్శ బోయిన మహేష్ ,కో-కన్వీనర్ గా చెన్నూరు వెంకన్న**





**కురవి ఫిబ్రవరి 20 (మనం న్యూస్) :** యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్ గా పర్శబోయిన మహేష్, కో కన్వీనర్ గా చెన్నూరు వెంకన్న లను యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మొగురం.రమేష్ , రాష్ట్ర కో కన్వీనర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి కోమ్మన బోయిన యాకయ్య యాదవ్ లు నియమించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఆలస్యం చేయకుండా వెంటనే సీనియారిటీ ఆధారంగా ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతనంగా నియమకమైన కన్వీనర్, కో కన్వీనర్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఇచ్చిన పదవి బాధ్యతలకు తగిన న్యాయం చేస్తామన్నారు.